# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com | ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 | E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 12-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:152 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

శిఖర కొన
దేవుడిమీద ఆన
జారితే కోన

మరో నియంత
వాడు ఉరి కి చెంత
టెంపరి ట్రంపు.

కొత్త యాపులు
చౌష్టి నైపుణ్యాలు
సంఖ్య హెచ్చాలి.

విద్య ఉచితం
దేశంలో తొలిరాష్ట్రం
కేరళ భళా.

కాల సూచిని
ప్రణాళిక దర్శిని
సాధన ఫలం

- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

పాలకుడే బలవంతుడు
పడగెత్తిన పాము !
ప్రజలంతా చీమ గుంపు
పట్టె మూగ నోము !

ప్రజల కొరకు పని చేస్తూ
వదలండోయ్ విద్వేషం !
లేదంటు విషం జిమ్మట
ఏమిటో మీ ఉద్దేశం !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# డే కేర్ సెంటర్‌లో కాల్పులు 34 మంది మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: గుర్తుతెలియని దుండగుడు కాల్పులు జరపడంతో 34మంది మృతిచెందిన విషాద ఘటన థాయ్‌లాండ్ లో చోటుచేసు కుంది. సోంక్లాలోని డే కేర్ సెంటర్‌లో అభం శుభం తెలియని చిన్నారులని కూడా చూడకుండా అత్యంత అమానుషంగా కాల్పులు జరిపాడు. అనంతరం తానూ కాల్చుకొని మృతిచెందాడు.

ఈ కాల్పుల్లో మొత్తం 23 మంది చిన్నారులు, 11 మంది సిబ్బంది మృతిచెందారు. సమా చారం అందించిన వెంటనే పోలీ సులు ఘటనా స్థలానికి చేరుక న్నారు. నిందితుడు ఎవరు ఎం దుకింత క్రూరంగా ప్రవర్తిండానే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భాగ్యనగరంలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు..

హైదరాబాద్, ఫిబ్రవరి 11: హైదరాబాద్ నగరంలో భారీగా గంజాయి రవాణా విక్రయానికి పాల్పడుతున్న నెట్‌వర్క్‌ను పోలీసులు గుట్టురట్టు చేశారు. వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, ఎస్ఆర్ నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో 70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన మనీల్ దలబెహరా, ఇస్మాయిల్ రైతా అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

ఒడిశాలో గంజాయి సాగు..

పోలీసుల వివరాల ప్రకారం.. మనీల్ దలబెహరా అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఒడిశాలో గంజాయి సాగు చేశాడు. ఆయన పండించిన గంజాయిని హైదరాబాద్‌లో విక్రయించాలని ప్లాన్ చేశాడు.

ఈ క్రమంలో మేడ్చల్‌లో నివసిస్తున్న ఒడిశాకు చెందిన ఇస్మాయిల్ సహకారంతో నగరంలో మనీల్ దలబెహరా సరఫరా చేశాడు. ఇస్మాయిల్ ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూ.. గంజాయి విక్రయం నిర్వహిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని అన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# మూసీ అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 11: మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మూసీ అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభి ంచింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఫేజ్ ఏ1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ ఏ2లో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్లు పరిధి లో భూసేకరణ చర్యలు చేపట్టను న్నారు అధికారులు.

హైదరాబాద్, గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండపేట మండలం పరిధిలో భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరించేందుకు ప్రక్రియ ప్రారంభమైంది. భూ యజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆయా యజమానులు తమ హక్కుల పత్రాలు(పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు) నిర్దేశిత సమయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏమైనా అభ్యంతరాలుంటే నిర్ణీత సమయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు.

సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను కూడా ప్రకటించారు. ఒజీనిట ంఞనబీతిబతిబితినీని ంఞబి, 2013 నిబంధనల ప్రకారం.. ఈ భూసేకరణ ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసి అభివృద్ధి పనులు దశలవారీగా కొనసాగనున్నాయి. మొత్తం గండిపేట నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల పరిధిలో, 14 మండలాలు, 46 గ్రామాల్లో మూసీ అభివృద్ధి జరగనుంది.

# మన డేటా రక్షణకు చర్యలేవీ.. కేంద్రంపై రాహుల్ ప్రశ్నల వర్షం

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 11: డాలర్ ఆధిపత్యంపై కొన్ని దేశాలు పోరాడుతున్నాయని ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానిం చారు. అమెరికా ఆధిపత్యానికి పలు దేశాలు సవాళ్లు విసురుతు న్నాయని తెలిపారు. ఇంధన, ఆర్థిక రంగాలను ఆయుధాలుగా మార్చుకుంటున్నాయని చెప్పుకొచ్చారు. ఉక్రెయిన్, పాలస్తీనాల్లో యుద్ధాలు జరుగుతున్నాయని వెల్లడించారు. లోక్‌సభ సమావేశాల సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఏఐ ప్రమాదం ఉందని పలువురు అంటున్నారని ప్రస్తావించారు.

భారత్‌కు ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి అని రాహుల్ గాంధీ అన్నారు. ఏఐకి ఇంధనమే డేటా.. అది లేకపోతే ఏఐ శూన్యమని చెప్పుకొచ్చారు. చైనా, భారత్.. ప్రపంచంలో అతిపెద్ద డేటా కేంద్రాలని వివరించారు. వ్యవసాయ రంగంలో ఆహారోత్పత్తి భారత్‌కు సానుకూలాంశమని తెలిపారు. ప్రపంచ పరిణామాలను బడ్జెట్ ప్రతిబింబించలేదని అన్నారు. భారత్ డేటానే అమెరికా, చైనాలకు కీలకమని వివరించారు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకమని, గతంలో అధిక జనాభా ఒక సమస్య.. అదే ఇప్పుడు పెద్ద ఆస్తి అని చెప్పుకొచ్చారు. అమెరికా - భారత్ ట్రేడ్‌డీల్ ఇటీవలే కుదిరిందని అన్నారు. డాలర్‌ను బలోపేతానికి ఈ ట్రేడ్ డీల్ దోహద పడుతుందని వెల్లడించారు. మన డేటా రక్షణకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. డీల్‌లో ఇంధన భద్రతలోనూ తగిన చర్యలు లేవని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు.. ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



కొడంగల్ , ఫిబ్రవరి 11: మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూలులో ఆయన ఓటు వేశారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయద్దేరారు. కాసేపట్లో ఆయన ఢిల్లీ వెళ్ళనున్నారు.

మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు పోలింగ్ కేంద్రంలో డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క ఓటు హక్కు వినియోగిం చుకున్నారు.

మంచిర్యాలలోని హైటెక్‌సిటీ లో 227వ నంబర్ పోలింగ్ బైత్‌లో మంత్రి వివేక్ ఓటు వేశారు.

# మూడు కార్పొరేషన్లుగా జీహెచ్‌ఎంసీ విభజన

హైదరాబాద్, ఫిబ్రవరి 11: జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)గా విభజించింది. ఈ క్రమంలోనే మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగుతుండగా.. సైబరాబాద్‌కు శ్రీజన, మల్కాజ్‌గిరి వినయ్ కృష్ణారెడ్డిలను రాష్ట్ర సర్కార్ నియమించింది.

కాగా.. ఓఆర్ఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్‌ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి కూడా చేపట్టనుంది. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా స్రామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది.

అలాగే.. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఎల్‌బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్ ప్రాంతాలతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా.. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లతో జీహెచ్‌ఎంసీని విభజించింది. ప్రస్తుతం 1450 చదరపు కిలోమీటర్ల మేర మంచినీటి సరఫరాతో పాటు 650 చ.కి.మీ.ల మేర సివరేజ్ నిర్వహణ చేస్తున్న జలమండలి.. ఇక నుంచి 2,053 చ.కి.మీ. మేర మంచినీటి సరఫరాతో పాటూ సివరేజ్ నిర్వహణ చూడనుంది. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్మించేందుకు జలమండలి చర్యలు తీసుకోనుంది.

# మహా శివరాత్రికి 2,243 ప్రత్యేక బస్సులు.. 43 శైవ క్షేత్రాలకు సర్వీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి పండుగ ఉండటంతో.. ఈనెల 14 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. అదేవిధంగా కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్‌లు, తాగు నీటితోపాటు పబ్లిక్ అడ్రన్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17 తేదీ వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది.

శివరాత్రి ఆపరేషన్స్‌పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ, ఎండీ శ్రీ వై నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. గత శివరాత్రి కంటే ఈసారి 208 బస్సులను అదనంగా సంస్థ నడుపుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసింది.

మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో) రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం.. మహిళలకు యథావిధిగా ఉచిత రవాణా సదుపాయం అమల్లో ఉంటుంది. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్ ను www.tg srtcbus.in వెబ్‌సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040- 69440000, 040-234500332లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# ముగిసిన మున్సిపల్ పోలింగ్..

హైదరాబాద్, ఫిబ్రవరి 11: తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ పోలింగ్ ముగిసింది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు సంబంధించి ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ ఇవాళ సాయంత్రం 5 గంటలతో ముగిసింది. 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు.

మొత్తం 116 మున్సిపాలిటీలలోని 2582 వార్డులకు గాను 12 వార్డులు ఏకగ్రీవం కాగా ఒక చోట వాయిదా పడింది. దీంతో ఇవాళ 2569 వార్డులకు పోలింగ్ నిర్వహించారు. ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన 414 వార్డుల్లో 2 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 412 వార్డులకు పోలింగ్ నిర్వహించారు.

పోలింగ్ సరణి తొలుత ప్రశాంతంగా ప్రారంభమైనప్పటికీ పోలింగ్ ముగిసే సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఉద్రిక్తతలు నమోదయ్యాయి.

ప్రధాన పార్టీల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పలు చోట్ల రాజకీయ పార్టీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్లు ఈ నెల 13న లెక్కించనున్నారు.

# మార్చి 17 లోపు నివేదిక ఇవ్వాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 11: గ్రూప్-1పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. గ్రూప్-1 మూల్యాంకనం అక్రమాలపై సిట్ వేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఏడీజీ స్థాయి అధికారితో సిట్ విచారణ జరపాలన్న హైకోర్టు.. మార్చి 17 లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోవాలని, ఎంపికైన అభ్యర్థుల జవాబు పత్రాలు భద్రంగా ఉన్నాయా, వాటిని ఎవరైనా ట్యాంపర్ చేశారా అనే విషయాలను పరిశీలించాలని న్యాయస్థానం సూచించింది. మార్చి 16లోగా నివేదిక సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి అనుబంధ పిటిషన్లను పరిష్కరించిన హైకోర్టు.. ప్రధాన వ్యాజ్యాలపై విచారణను వాయిదా వేసింది.

# ఆగిన బైకుపై ఉన్న చిన్నారులపైకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు.. పిల్లలు మృతి

బెంగళూరు ఫిబ్రవరి 11: బెంగళూరులో దారుణం జరిగింది. రోడ్డుపై కానిస్టేబుల్ ఒక బైకు మీద పిల్లలతో ఆగిఉండగా.. వారిపైకి స్కూల్ బస్సు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు మరణించారు. ఈ ఘటన నార్త్ బెంగళూరులోని తానిసంద్ర ప్రాంతంలో బుధవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో జరిగింది. మృతులు భాను (4), వర్ష (2)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా కానిస్టేబుల్‌గా పని చేసే నగనగౌడ అనే వ్యక్తి ఉదయం పాల ప్యాకెట్ కోసం ఇంటినుంచి బైకుపై బయటకు వచ్చాడు. తనతోపాటు కూతురు వర్షను, అన్న కూతురు భానును బైకుపై ఎక్కించుకుని వెళ్లాడు. మూల మలుపు వద్ద పిల్లలిద్దరితో కలిసి బైకుపై ఆగిఉన్నాడు. అదే సమయంలో అక్కడికి ఒక స్కూల్ బస్సు వేగంగా వచ్చి టర్న్ తీసుకుంది. రోడ్డుపై ఉన్న వీరిని గమనించకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా స్కూల్ బస్సు నడిపాడు. దీంతో బైకు పక్కకు పడిపోగా, చిన్నారులిద్దరూ బస్సు టైర్ల కింద పడిపోయారు. నగనగౌడ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. టైర్ల కింద పడ్డ చిన్నారులు వర్ష, భాను తీవ్రంగా గాయపడ్డారు.

# ఘోర రోడ్డు ప్రమాదం..

## ఒకరిమృతి.మకరి పరిస్థితి విషమం..



అమరావతి, ఫిబ్రవరి 11: వెల్దండ మండల సమీపంలోని హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారి పై కొట్ర గేట్ చౌరస్థలో శివ స్వాములకి అనుకోని ప్రమాద ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కొట్ర గేట్ పరిధిలోని శివ స్వాముల ఆటోను ట్రాక్టర్ ఢీకొనగా ప్రమాదంలో శివ స్వామి ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు స్థానికులు తెలిపారు.

ప్రమాదానికి గురైన వ్యక్తులు వికారాబాద్ కు సంబంధించిన వారిగా అనుమాని స్తూ పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

**రాధశ్రీ రాగాలు**

ఎలుక దూరును కలుగు
అతివ మాటల కలుగు
ఊహ మనమున కలుగు
నను రాధశ్రీ !!

గదిన వెలుగును లైటు
హెవీ కానిది లైటు
స్నేహ మిడును డిలైటు
నను రాధశ్రీ !!

-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

పార్లమెంటు స్పీకర్ పై
ప్రతిపక్షం అవిశ్వాసం
ప్రజాస్వామ్య హక్కుల
పరిరక్షణ ఆశ్వాసం

గెలువదనీ తెలిసినా
గొంతుల్లో ఒక నిరసన
స్వతంత్రంగా సభాపతి
సాగాలని ఇక వరసన

-వేల్పుల నారాయణ
9440433475




# నేటినిజం సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 12-2-2026


## సప్త పదులు

| | | |
|---|---|---|
| ఉత్సాహం<br>ప్రోత్సాహం<br><br>పని తలపెట్టినప్పుడు<br>వదిలిపెట్టాలి<br>మనలోని<br>నిరుత్సాహం<br><br>-కట్టెకోల చిన నరసయ్య<br>బోదులబండ | అమ్మానాన్నలు<br>జన్మప్రదాతలు<br><br>కష్టనష్టాల్లో తోడై<br>మార్గం<br>చూపే<br>దేవదేవతలు<br><br>-అండేకార్ అల్లాజీ<br>9010558190 | అరసం<br>విరసం<br><br>కవులకు<br>తెలుసు<br>పదాలు<br>పండించే రసం<br><br>-పాటిబండ్ల కవిత<br>విజయవాడ |

# పాటతో ఉద్యమానికి ఊతమిచ్చిన అందెశ్రీ



'అందెశ్రీ' కవితా సంకలనం ఆవిష్కరణలో డా॥ నాళేశ్వరం శంకరం, బైస దేవదాసు, వైరాగ్యం ప్రభాకర్, మౌనశ్రీ మల్లిక్, బ్రహ్మశ్రీ పాణ్యం దత్తశర్మ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నేటినిజం ప్రతినిధి): తన పాటతో ఉద్యమానికి ఊతమిచ్చిన కవి అందెశ్రీ అని, నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు అన్నారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికపై జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరై వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన ప్రజాకవి అందెశ్రీ కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వం గాని కథలు గాని చదివినప్పుడు మనలో కొన్ని ఆలోచనలు వస్తాయి. గొప్పగా జీవించాలనే తపన కలుగుతుంది. సమాజంలో మార్పు తీసుకువచ్చేవే కథలు, కవితలు అన్నారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డా॥ నాళే శ్వరం శంకరం సభకు అతిథిగా హాజరై ప్రముఖ రచయిత్రి శ్రీమతి కె. అమృత జ్యోత్స్న రచించిన అమ్మ కథలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన



'అమ్మ కథలు' పుస్తకావిష్కరణలో కె. మధు, డా॥నాళేశ్వరం శంకరం, శ్రీమతి కె. అమృత జ్యోత్స్న, బైస దేవదాసు, వైర్యాగం ప్రభాకర్, మౌనశ్రీ మల్లిక్, బ్రహ్మశ్రీ పాణ్యం దత్తశర్మ.

మాట్లాడుతూ భర్తను తల్లిగా భావించిన రచయిత్రి కలం నుండి వెలువడిన అమ్మ కథలు సంపుటిలో అమృతాన్ని మించినది అమ్మప్రేమ అని ప్రకటించారు. నేటి కాలపు తల్లుల వెతలకు, ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దం పట్టేలా ఉన్నాయన్నారు. ప్రముఖ కవి, పండితులు, కాలమిస్ట్, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ పాణ్యం దత్తశర్మ రచయిత్రి కే. అమృత జ్యోత్స్న రాసిన అమ్మ కథలు పుస్తకాన్ని సమీక్షిస్తూ తల్లులు ఎదుర్కొంటున్న సమస్యలను కథలుగా మలిచి అందించారని ఈ కథల్లో తల్లి హృదయం కన్పిస్తుందని అన్నారు. తల్లి ప్రేమకు సమానమైనది ఈ ప్రపంచంలో ఏదీ లేదని అన్నారు. ప్రముఖ కవి టీవీ సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ ప్రజాకవి అందెశ్రీ కవితా సంకలనం గురించి మాట్లాడుతూ అందెశ్రీ ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలిగిన వారనీ, ఎవరికీ భయపడని ధీశాలి అని అన్నారు. ఆయన రాసిన పాటలు ప్రసిద్ధ మైనవని, ఆయన వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకొని కవులు రాసిన కవితలు ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయని అన్నారు. రచయిత్రి అమృత జ్యోత్స్న తన కథలను పుస్తక రూపంలోకి తీసుకురావడమే కాకుండా ఆవిష్కరింపజేసిన భవానీ సాహిత్య వేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సభకు వచ్చిన అరవై మంది కవులు వందేమాతర గీతంపై కవితా గానం చేశారు. సభకు హాజరైన కవులను శాలువా, సర్టి ఫికెట్, మెమెంటోతో సత్కరించారు.

## సప్త పదులు

| | | |
|---|---|---|
| అనుభూతులు<br>ఆశ్చర్యాలు<br><br>హృదిని తట్టిన<br>పరిస్థితులు<br>మరువలేని<br>చిరస్మరణీయాలు.<br><br>-బి స్వాతి కరుణాకర్<br>హైదరాబాద్. | గీతలు<br>రాతలు<br><br>భవిష్యత్తు తరానికి<br>అక్షరమే<br>అసలైన<br>బాటలు .<br><br>- యామిని కోళ్ళూరు<br>నెల్లూరు | భోగాలు<br>రోగాలు<br><br>ఎక్కువైతే<br>కడకు మిగిలేది<br>రక్తకన్నీరు<br>శోకాలు<br><br>-కాళిదాసు సుబ్బయ్య<br>8790607706 |


తెలంగాణ సారస్వత పరిషత్తు
హైదరాబాదు.
ఆహ్వానం
పరిణతవాణి
65 ఏళ్ళ ప్రాయం దాటిన ప్రఖ్యాత కవి పండితులు, ప్రముఖుల స్వీయసాహిత్య జీవిత విశేషాలను ఆవిష్కరింపజేసే ఉపన్యాస పరంపర
అధ్యక్షులు
ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు



ప్రసంగకర్త
శ్రీ గుండు వల్లీశ్వర్ గారు
ప్రముఖ పాత్రికేయులు,
సాహితీవేత్త
సమావేశకర్త
డా. ఎ. సిల్మానాయక్
ప్రధానాచార్యులు, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల
తేది : 2026 ఫిబ్రవరి 13, సాయంత్రం 5.30 గంటలకు
వేదిక : డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం, తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాదు
ఈ కార్యక్రమానికి తప్పక విచ్చేయవలసిందిగా సాదరంగా ఆహ్వానిస్తున్నాం
డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు


# ముగుస్తున్న అధ్యాయం

నా కళ్ల ముందే
నా ప్రపంచం
వాడిపోయిన పూలతోటలా మారుతోంది?
ఎరుపు గులాబీ రేకు
నేలరాలింది నిన్న,
ఈరోజు తెల్లని మల్లె,
రేపు పసుపు రంగు ఆకులు కూడా?
నాకు
ఖాళీ కొమ్మల తోటి
చివరి వీడ్కోలు పలుకుతాయేమో.

సముద్రం తన అలలను
తానే వెనక్కి లాగేసుకుంటే
ఒడ్డున మిగిలేది ఏమిటి?
తడి ఇసుక,
పగిలిన చిప్పలు,
ఎండిపోతున్న నురగ గీతలు?
మరో తరంగం వచ్చే వరకు
నిశ్శబ్దం మాత్రమే.
అలాగే నా బంధాలు కూడా
ఒక్కొక్కటిగా దూరమౌతున్నాయి.

ఫొటోలోని అమ్మ కన్నుల్లో
నేను ఎప్పుడో చదివిన పుస్తకాన్ని చూస్తున్నాను,
స్నేహితుడి నవ్వులో
రేపటి బిజీ షెడ్యూల్ కనిపిస్తోంది,
ప్రేమికురాలి మౌనంలో
చెప్పలేని నిజం వినిపిస్తోంది.

కాలం తన చేతుల్లో
నా అధ్యాయాన్ని పట్టుకుని
చివరి పంక్తులు చదువుతోంది?.

అర్థం కాని పజిల్ లాగా,
సమాధానం లేని ప్రశ్నలాగా
నేను రాయబడ్డాను.
పూర్తి కావాలని కాదు,
అందరికీ నచ్చాలని కాదు?
సృష్టి నన్ను రాసింది.

ఒక క్షణం మెరిసి
మళ్ళీ చీకట్లో కలిసిపోయే
మెరుపులా? అంతే.

కానీ?
ఆ చీకట్లో కూడా
నా మెరుపు వెలుగు గుర్తు ఉంటుంది,
ఉరుములో
నా స్వరం మారుమోగుతుంది.

నేను వెళ్లిపోతున్నాను అని కాదు,
కరిగిపోతున్నాను అని కాదు?.

నిన్న పువ్వు,
ఈరోజు సువాసన,
రేపు జ్ఞాపకం.
సృష్టి యొక్క అంతులేని శ్వాసలో
నేను ఒక గాలి కణం కావచ్చు?

కానీ ఆ గాలి లేకుండా
ఊపిరి ఎలా?

అక్కడే దాగుంది
జీవితం అనే రహస్యం.

నేనే నా శ్మశానం
కానీ నేనే నా జననం కూడా.

ప్రతి చివరి
ఒక కొత్త మొదలు.



-మువ్వా శ్రీనివాసరావు
సెల్: 9948099900

# "పత్రికారంగ విజ్ఞానదీప్తికి అక్షరాల హారతులు"



-డాక్టర్ కె.జి. వేణు
విశాఖపట్టణం
98480 70084

కాలంతో పాటు మనిషి కలకాలం నిలిచిపోవడం కొందరి జీవితాలకు మాత్రమే సాధ్యం. నడిచిన నేల సాక్షిగా పైనున్న ఆకాశం సంతకాలు పెడుతూ వుంటే గతించిన కొందరి జీవితాలలోని అధ్యాయాలు ఆలయాలలోని గంటలా మ్రోగుతూ వున్నాయి. ఆ ధ్వనితరంగాల మధ్య నిలబడి ఆశ్చర్యంగా చూస్తున్నాను నేను. ఇంతలో అక్షర కర్మాగారాన ఘర్మజలము చిందిన శబ్దం. ఇంతలో బిగ్గరగా వినిపిస్తున్న వరం గల్లు వాణి, బాణి. ఆ ప్రక్కనే ఎప్పటికీ ఫలా లు రాలిపోని ఒక మహా వృక్షం. ఆ నీడలో జనచైతన్యమే తన ఆశయంగా ప్రకటిస్తూ పెద్దమనుషుల నడ్డి విరిచి, అక్షరాక్షరాన కాకతీయ పౌరుషాన్ని నింపి, తన కలాన్నే తాను సంధించే పాశుపతాస్త్రంగా మార్చు కున్న ఒక సమరసేనాని విశ్వరూపం విస్మ యం కలిగిస్తూ కనపడింది.. ఆయన చుట్టూ ఒక మహా వెలుగు. ఒళ్లంతా కళ్ళు చేసుకుని భక్తిపూర్వకంగా చూశాక

> **రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కందిలీ ఒక చేత లాఠీ మరొక చేత పట్టుకుని ప్రతాపరుద్ర దళం కార్యకర్తగా సింహగర్జన చేసిన ఆచార్య గారి గళం అదృశ్యంగా విని పించడం ఒక భాగ్యమే.**


ఆ మహానుభావుడు యం. యస్. ఆచార్యగారని, చుట్టూ వున్న గాలి నా చెవుల దగ్గర గుసగుసలాడినప్పుడు ఆనందంతో తడిచిముద్దయి పోయాను. అలా చూస్తూ వుండగానే ఆ కారణజన్ముడు ఒక పుస్తక రూపంలోకి మారగానే, ఆ పుస్తకం నా చేతుల్లో ఒక అపురూపమైన కానుకలా వాలిపోయింది.

ప్రశాంతంగా ఇంకా తెల్లారకముందే అందులోని పేజీలను తాకి, వాటి తలుపుల ను తెరుస్తూవుంటే, అందులోని ప్రతి అక్షరం కవాతు చేస్తూ కనిపించింది. రోజూ నేను ఉదయాన్నే తూర్పు దిక్కున ఒక సూర్యుడ్నే చూస్తున్నాను. ఆశ్చర్యంగా పుస్తకంలోని ప్రతి పేరా ఒక తూర్పు దిక్కుగా, ఆందులోనుంచి వందలాది సూర్యుళ్లు అద్భుత భావజాల వెలుగులతో కరచాలనం చేయటం నా అనుభూతిని అంబారీమీద వూరేగించిన ట్లు గా వుంది. ఈ సంపద నిండా అన్నీ వజ్రాల విలువను మించిన సంగతులే. దాదాపు 14 గ్రామాలలో అసంఖ్యాక శిష్యగణాన్ని కలిగిన ఊభయ వేదాంత విద్వాంసులు, రామానుజ రహస్య త్రయ వివరణ కర్త, ఆచార్యుల వారి తాతగారైన మాడభూషి శ్రీ రంగాచార్యుల వారి విశేషాలు ఈ వేదిక మీద లక్ష దీపాల కాంతితో పలకరిస్తున్నాయి. బహుముఖ ప్రజ్ఞాశాలులకు పుట్టినిల్లుగా ప్రశంసలందుకున్న ఆ కుటుంబంలో పేదరిక నేపథ్యంలో జన్మించిన యం. యస్. ఆచార్యగారు పేపర్ బాయ్ నుండి పత్రికా సంపాదకుడిగా శిఖరా గ్రస్థానా లకు ఎదిగిన సందర్భాలన్నీ ఒక గొప్ప చరిత్రకు ముఖచిత్రాలుగా ఇందులో నిలుస్తున్నాయి.

ఈ పుస్తకంనిండా చరిత్ర నమోదు చేసుకున్న వందలాది విషయాలు తమ గొం తులెత్తి ఎన్నో సంగతుల్ని గానం చేస్తున్నాయి. నిజాం దుర్మార్గాల వికృతరూ పాలను సజీవంగా అందిస్తోంది ఈ రచన. రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కందిలీ ఒక చేత లాఠీ మరొక చేత పట్టుకుని ప్రతాపరుద్ర దళం కార్యకర్తగా సింహగర్జన చేసిన ఆచార్య గారి గళం అదృశ్యంగా విని పించడం ఒక భాగ్యమే. 25 మంది సభ్యులున్న పెద్ద కుటుంబాన్ని బతికించడానికి పేపర్ బాయ్ గా కష్టాల నిప్పులమీద నడిచిన ఆ పాద ముద్రల గుర్తులు నేరుగా మన గుండెల్ని తాకుతున్నాయి. విపరీతమైన కడుపు నొప్పి వున్నాసరే తప్పని పరిస్థితుల్లో సైకిల్ తొక్కి నొప్పి భరించలేక అరుగుమీద పడిపోయిన దృశ్యం చదివే పాఠకుల కళ్లనిండా కన్నీరుగా మారుతోంది. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు దేవులపల్లి వెంక టేశ్వరరావు గారితో ఆచార్యుల వారి పరి చయ విశేషాలతో మరింత శోభను ఈ గ్రంథం అందిస్తోంది.

ఆచార్యుల వారి జీవితంనిండా లెక్కించ డానికి సాధ్యం కాని కోణాలను ఈ గ్రంథం అందిస్తోంది.

మొదటి ఉద్యోగం కంపౌండర్ చేసిన, గ్రంథాలయాల వైపు సాగిన వీరి అభిరుచి మనకు ఎన్నో పాఠాలు నేర్పుతోంది. ప్రతాపరుద్ర దళంలో కదిలే ఒక యుద్ధనౌకగా మెరిసిన వీరి సాహసం చరిత్ర చాలా ఘనంగానే నమోదు చేసుకుంది. హైదరాబాదు విమోచన ఉద్యమాన్ని గురించి చదవడం మొదలు పెట్టా క, నా చుట్టూ తుపాకులు మ్రోగుతున్నాయి. అనేక కుటుంబాలు ఆత్మరక్షణ కోసం పరు గులు తీస్తున్న హాహాకారాలు. ఆ




ప్రతులకు:
ఆచార్య మాడభూషి శ్రీధర్
సెల్: 8447651505



సమయంలో ప్రాణాలకు తెగించి, రజాకార్ల దృష్టినుంచి తప్పించుకుంటూ పోరాటానికే అంకితమైన ఆచార్యుల వారి ధైర్యసాహసాలకు ఆ నేల ఎప్పటికీ నమస్కారం చేస్తూనే వుంటుంది. యం.యస్. ఆచార్యగారిని స్వాతంత్ర్య సమర యోధుడిగా నిలబెట్టిన అనేక సంఘటనలు సాక్ష్యాల దివిటీలతో మనముందు ఈ పుస్తకంలో కవాతు చేస్తున్నాయి. హయగ్రీవా చారి బార్డర్ నుంచి పోరాటం చేసే బృందంలో ప్రముఖ వ్యక్తిగా కొనసాగిన ఆచార్యులవారు ఎన్నోసార్లు తనకు జరిగిన హత్యా ప్రయత్నా లనుంచి తప్పుకున్న చతురత సువర్ణాక్షారాలతో లిఖించేదిగా వుంది. విలేఖరిగా వైవిధ్యమైన స్థాయిలో వెలువడిన ఆయన ఆలోచనలకు పాలేకర్ అవార్డు వరించడం ఆయన ఉద్యోగం కూడా పోవడం జరిగిపోయాయి. అయినా దేనికీ అధైర్యపడని సాహసి ఆచార్యుల వారు.

తెనాలిలో జర్నలిజం శిక్షణ శిబిరాన్ని నడిపిన శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారి చిరునవ్వుల్ని సైతం అందించిన ఈ పుస్తకంలో ఆచార్యుల వారి వివాహ విశేషాలు అమితంగా ఆకట్టుకున్నాయి. 'ఇంకెన్నాళ్లు?' అంటూ ప్రశ్నించిన కాళోజీ ప్రశ్న ఉరుములా వురు ముతోంది. సుద్దాల హనుమంతుగారు రాసిన 'బండెనుక బండికట్టి పదహారు బండ్లుకట్టి. ..' పాట మరోమారు గంభీరమైన స్వరంతో ఉద్రూతలూగించింది. సందర్భాలను బట్టి నైజం సంస్కృతి ఎంత క్రూరమైన పైశాచిక దుశ్చర్యలతో సామాన్య జనాన్ని పీడించిందో ఆ వివరాలు పాఠకుల రక్తాన్ని మరిగిస్తు న్నాయి. ఆచార్య గారితో గాఢమైన స్నేహం కలిగిన పేర్వారం జగన్నాథంగారిని వారి ప్రతి భా వైభవాలను దర్శించటం మన అరచేతుల్లో ఒక అదృష్టరేఖలా ఆ విషయం మారిపోతోంది.

తెలంగాణ పోరాట వీరుడు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు రావి నారాయ ణరెడ్డిగారు ఈ వేదిక మీద కనిపించడం తో ఎత్తిన పిడికిళ్లనిండా నినాద గర్జనలు సిం హనా దాలుగా మారిపోతున్నాయి.

తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమకారుడు నల్ల నర్సింహులు, రాపాక రామచంద్రారెడ్డి... ఇలా ఎందరో వీరుల వీరత్వాన్ని వివరిస్తూ పేజీల న్నీ మారుమ్రోగిపో తున్నాయి. హైదరాబాదు రాజ్య విలీన దృశ్యాలు ఒక చలన చిత్రంలా ఒక గాఢమైన స్థాయిలో అందిం చబడ్డాయి.

1958లో ఆచార్యగారు ప్రారంభించిన 'జనధర్మ' పత్రిక ఆయన జీవితంలో ఎలా ఒక ప్రధాన భాగంగా అల్లుక పోయిందో వివరించిన పదాలనిండా పత్రికను నడిపిం చడంలో ఎదురైన కష్టాలు, నష్టాలు పాఠ కుల్ని తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయి. కుంభకోణాలను పసిగట్టి, పత్రిక ద్వారా బహిర్గతం చేయడంలో ఆచార్యులవారు ప్రదర్శించిన సాహసం ఎంతోమంది విలేఖరులకు తిరుగులేని స్ఫూర్తిదాయక పాఠాలుగా నిలిచింది. వేదాలు, వాదాలు, వివాదాలు పుట్టిన వరంగల్లు నేలమీద 30 ఏళ్లు అనితరసాధ్యంగా ఒక పత్రికను నడిపిన ఘనత ఆచార్యుల వారిదే. అనేక సందర్భా లలో

> **పత్రికను నడిపిం చడంలో ఎదురైన కష్టాలు, నష్టాలు పాఠ కుల్ని తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయి.**

అభినందన ప్రత్యేక సంచికలను సైతం ముద్రించి ఎంతో విలువైన సమాచారాన్ని ఆచార్యులవారు లోకానికి ఆందించేవారు. వీక్లీగా వున్న పత్రిక 1980లో దినపత్రిక మారడం వెనక దాగిన ఆచార్యుల వారి దృఢసంకల్పం అద్వితీయంగా చిత్రీకరిం చబడింది. ఈ పత్రిక సాహిత్య సంకలనాల ద్వారా ఎంతోమంది సాహితీవేత్తలను వెలు గులోకి తెచ్చిన ఘనత ఆచార్యుల వారిదే. అందులో "నారదవీణ", "లంబోదరా య ణం" శీర్షికల క్రింద ప్రచురించిన వ్యాసాలను అప్పటి పాఠకులు చదివి ఉద్రూతలూ గిపో యేవారన్న విశేషాలు, ఆ వ్యాసాల ఆధ్య యనం పట్ల పాఠకుడి మనసు కూడా ఎంతగానో ఆశలు పెంచుకుం టోంది.

ఆత్మవిశ్వాసానికి, పట్టుదలకు చిరునా మాగా నిలిచిన వ్యక్తి ఆచార్యులవారు. నిత్య సాహిత్య సంశోధాత్మకులుగా, ప్రజల నాడిని తెలుసుకొ నడంలో అపూర్వ మేథాసంపత్తికి వారసులుగా, జర్నలిస్టులకు తానొక విశ్వ విద్యాలయంగా మారిన సందర్భాలు ఆయన నడకలో కోకొల్లలు. ఆచార్యుల వారు తాను రాసిన వార్తల ద్వారా ఇబ్బందులు ఎన్ని ఎదురైనా, ప్రచురించడమే ధ్యేయంగా కొన సాగిన వారి జీవితం నిండా ఎన్నో సాహసాలు తొంగిచూస్తూ వుండటం ఓ గొప్ప విశేషం. నాలుగు దశాబ్దాలు పైబడి పత్రికా రంగంలో ఆయన చేసిన కృషి అన్యన్య సామాన్యమైనది. తనకోసం కాకుండా జనంకోసమే తన వూపిరిని ఆయుధంగా చేసుకున్నారు. అక్షరంమీద అనంతమైన విశ్వాసం, గౌరవం కలిగిన మహామనిషి ఆయన. ఈ ప్రపంచం ఉన్నంతవరకు అక్షరాన్ని మించిన ఆయుధం లేదని ప్రగాఢంగా నమ్మిన సాహితీ ప్రేమికుడు ఆయన. పత్రికను మామూలు కాగితం రూపంలో ఏనాడు ఆయన చూడలేదు. పత్రి క అంటే అది తన గుండె సవ్వడి. గుండెలోని ధైర్యమే అక్షరాలుగా మారుతున్నాయని విశ్వసించిన పోరాట యోధుడు ఆచార్యుల వారు. ఈ పుస్తకంలోని ప్రతి అంశం చరిత్రలోని అత్యంత విలువైన సమాచారాన్ని అద్భుతంగా ఆందించిన సందర్భమిది.

కొన్ని వందల చరిత్ర పుస్తకాల సారాన్ని ఒకే చోట ఒక సంపదగా పొందటం పాఠకులు ఊహిం చని ఒక అదృష్టం. ఈ విశేషాలను చదవడం ఒక గొప్ప అనుభూతిని ఆస్తులుగా పొందడమే.

జనధర్మ, వరంగల్ వాణి పత్రికల ఎడిటర్ యం.యస్. ఆచార్యగారి శతజయంతి సందర్భంగా ప్రచురించిన ఈ గ్రంథం ఆయన నిలువెత్తు చిత్రపటానికి అక్షరాలతో హారతులిచ్చిన వినయపూర్వక దృశ్యాలను కాలం తన క్యాలండర్లో ఎప్పటికీ మారిపోని తేదీలుగా మార్చుకోవడం ఆచార్యులవారికి తెలుగుజాతి అందించిన విశిష్ట గౌరవంగా అందరం భావిద్దాం.

# రమణాచారి వంటి అధికారులు అరుదు



డా॥ కె.వి.రమణాచారి జన్మదిన వేడుకల్లో జయంతి సావిత్రిని సత్కరిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, డా॥.కె.వి.రమణాచారి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నేటినిజం ప్రతినిధి):ప్రభుత్వంలో పనిచేసే అదికారుల్లో డాక్టర్ కె.వి.రమణాచారి వంటి అధికారులు చాలా అరుదు అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. సోమవారం నల్లకుంట శంకరమఠంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్ నిర్వహణలో డా॥కె.వి.రమణాచారి జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా దత్తాత్రేయ హాజరై మాట్లాడారు. డా॥కె.వి.రమణాచారి ఏడుగురు సీఎంల వద్ద పనిచేశారని చెప్పారు. ఆయన అన్ని రంగాలలో ప్రజ్ఞాశాలుడని అన్నారు. కళలను ప్రోత్సహిస్తున్న వ్యక్తి అని అన్నారు. డా॥కె.వి.రమణాచారి మాట్లాడుతూ.. ఎంత కాలం బతికామన్నది కాదని ఎలా జీవించామో అన్నదే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హరికథ సప్తాహంలో జయంతి సావిత్రి శ్రీనివాస కల్యాణం హరికథ గానం చేశారు. అనంతరం ఆమెను బండారు దత్తాత్రేయ, డా॥కె.వి.రమణాచారి సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాపోషకులు బోగరాజు మూర్తి, రవిశంకర్, కిన్నెర రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



-డా॥రావి రంగారావు
9247581825

ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపు లో డా. రావి రంగారావు 2024 జనవరి నుంచి వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరా యంగా నిర్వహిస్తున్నారు. ఈ వారం నిర్వహించిన కథల వర్క్ షాపులో ఇలా అంశం ఇవ్వటం జరిగింది.

"అత్త, కోడలు... ఈ రెండు పాత్రలు ఉండాలి. అవసరమైతే ఇతర పాత్రలు రచయిత ఇష్టం. కథ చదువుతుంటే మూడు నిమిషాలకు మించకూడదు. ఈ వర్క్ షాపులో బహుమతి పొందిన చల్లా సత్యవతి గారి కథ చదవండి.

# మహా పుణ్యవతి

పొద్దుగూకులు ఉపవాసం ఉండి సాయంత్రం రామ భజనకి వెళ్లి గుళ్లోనే స్పృహ తప్పుతుంది కాంతం.

స్పృహ తప్పిన కాంతాన్ని హాస్పటల్‌కి తీసుకెళ్తారు. అక్కడ డాక్టర్లు కాంతాన్ని పరీక్ష చేసి చనిపోయిందని చెబుతారు. చనిపోయిన కాంతానికి దహన సంస్కారాలు చేస్తారు.

అలా కాలిపోతున్న తన శరీరాన్ని చూసి కాంతమ్మ ఆత్మ అయ్యో నేను చని పోయానా అంటూ బోరున విలపిస్తుంది. ఇంతలో యమభటులు వచ్చి కాంతమ్మ ను యమలోకానికి తీసుకుపోతారు.

అక్కడ యమధర్మరాజు పాపులం దరినీ బోనులో పెట్టి ప్రశ్నిస్తున్నాడు. ఇక కాంతమ్మ వంతు వచ్చింది.

అక్కడికి చిత్రగుప్తుడు వచ్చి "నీ పేరు ఏమిటి" అని అడుగుతాడు.

"నా పేరు కాంతమయ్యా" అంటూ వణుకుతూ చెప్పింది.

"భగవద్గీత మీద ప్రమాణం చేసి నిజమే చెబుతావా" అంటాడు చిత్రగు ప్తుడు.

"అంతా నిజమే చెబుతానయ్య" అంటుంది కాంతం.

"కాంతమ్మా, బాగా ఆలోచించుకో, ఇది యమపురి. ఇక్కడ తప్పు ఒప్పులు పరీక్షించాలి.

అందుకని నీవు భగవద్గీత మీద ప్రమాణం చేసి నిజమే చెప్పాలి" అని అంటాడు యమధర్మరాజు.

"నిజమే చెబుతాను యమధర్మ రాజా" అంటుంది కాంతం.

"అయితే సరే, నీవు ఏమైనా పూజలు పుణ్యాలు చేశావా" అని అడుగుతాడు.

"అయ్యా, యమధర్మ రాజా, నేను పూజలు పుణ్యాలు చేశాను.

పొద్దుగూకులు ఉపవాసం ఉండి పూ జ చేసుకుని దేవుడికి నైవేద్యం పెట్టేదాన్ని.

ఇంక పుణ్యామంటారా, అడుక్కునే వాళ్లు వస్తే ఎన్నోసార్లు భోజనం పెట్టాను" అని చెబుతుంది కాంతం.

"నిజమేనా చిత్రగుప్త, ఈమె చెప్పే వన్నీ నిజాలేనా" అని అడుగుతాడు యమధర్మరాజు.

"నిజమే ప్రభూ, పూజలు పుణ్యాలు బాగానే చేసింది.కానీ పాపాల చిట్టాలు కూడా విప్పా లిగా" అన్నాడు.

"ఆ, చెప్పమ్మా కాంతం, మీ ఇంటిలో ఎంతమంది ఉంటారు" అని అడుగుతాడు చిత్రగుప్తుడు. .

"అయ్యా, మా ఇంటిలో నేను, నా భర్త, నా కొడుకు మాత్రమే ఉంటాము" అని చెబుతుంది."ఇంతేనా" అని అడుగుతాడు చిత్ర గుప్తుడు."భగవద్గీత మీద ప్రమాణమయ్యా, మా ఇంట్లో ముగ్గురమే ఉంటాము" అని అబద్ధం చెబుతుంది.

అక్కడ అబద్ధం చెబితే తల మీద మొట్టికాయ వేసే గంట ఒకటి ఉంటుంది.అది అబద్ధం చెప్పిన కాంతం తల మీద మొట్టికాయ వేస్తుంది.చురుకు తగిలిన కాంతం "నేను రామ భక్తురాలిని, నన్నే కొడతావా" అంటూ పళ్ళు పటపట కొరికి ఆ గంట మీద కలబ డుతుంది.ఆ గంటకు కూడా కోపం వచ్చి "నువ్వు అబద్ధం చెప్పింది కాక నా మీదే కల బడతావా" అంటూ తల మీద మొట్టికా యలు వేయడం ప్రారంభించింది.

ఈ గంట దెబ్బకు తట్టుకోలేక ఐల బోదిబో అంటూ "నన్ను క్షమించండి యమ ధర్మ రాజా, ఆ గంటను కొట్టడం నా తప్పే కానీ నేను నిజమే చెప్పానుగా, మా ఇంటిలో మేము ముగ్గురమే ఉంటాము" అనంగానే గంట మళ్లీ వచ్చి మొట్టికాయ వేస్తుంది.

ఇంతలో చిత్రగుప్తుడు "మీ ఇంటిలో నాలుగవ వ్యక్తి కూడా ఉంది. తానే మీ కోడలు" అని అంటాడు.

"ఛీ, అది నా కోడలు ఏంటి. కులం గోత్రం లేని దాన్ని నా ఇంటికి తీసుకొచ్చాడు నా పనికిమాలిన కొడుకు. నేను కోడలుగా దాన్ని చచ్చినా అంగీకరించను" అని అంటుంది కాంతం.

ఇంతలో యమధర్మరాజు "ఇంకేం చస్తావులే గాని ఆల్రెడీ చచ్చే యమపురికి వచ్చావు. అయినా మీకు ఇదేం పని, కులం గోత్రాలతో మానవత్వం మర్చిపోతు న్నారు.

ఏ బంధం లేకుండానే ఆ అమ్మాయి మీ ఇంటికి వచ్చిందనుకుంటున్నావా, ఒకరి భార్య ఒకరికి అవ్వదని నీకు తెలియదా.ఆ అమ్మాయి మీ అబ్బాయికి రాసి పెట్టి ఉంది కాబట్టే మీ ఇంటికొచ్చింది. మీకు సేవలు చేసింది. నీవేమో ఆ అమ్మాయిని రాసి రంపాన పెట్టావు. ఇరుగుపొరుగు వాళ్లతో కూడా నీ కోడలు గురించి చెడుగా చెప్పి ఎవర్ని పలకరీయకుండా చేశావు.

అందుకే నువ్వు చేసిన పాపానికి ఈ పాపులందరి మలమూత్రా లను శుభ్రం చేయి.నీ పాపం తొలగిపోగానే నువ్వు చేసిన పుణ్యానికి నీ కోడలు కడుపున కూతురిగా పుడతావు" అంటూ తీర్పునిస్తాడు యమ ధర్మరాజు.



-చల్లా సత్యవతి
కరాలపాడు, పల్నాడు



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## జాగ్రత్త !

జాగ్రత్త ....
ప్రతి ఓటూ
ఒక... నీ పచ్చినెత్తురు.
మాంసం ముద్ద చూస్తూ చూస్తూ వేయకు ఏదో
ఓ గద్దకి ఈ కేవలం ...
అది కేవలం
కాగిత మీద గుర్తు కాదు
జీవితం కింద ఎర్తు.
తూర్పు పడమరలో
కావలసింది వెలుతురు అనుకోకు.
వెలుతుర్లను పంచే సూర్యుడే కావాలి
అందరం కలిసి తేవాలి అందుకోసం
మన ప్రతి శ్వాస ఒక ధ్యానంగా మారాలి ప్రతి
అణువు ఒక్కటై చేరాలి ఈ నినాదాలు పాదాల
కింద తొక్కుడు పడిపోకండి ఆ వాగ్దానాల
అసత్యాలకు బలి అసలే కాకండి.

-రాధా రుద్రంగి
+91 94902 89018

## మహిళ

తొలి కోడి పిలుపు
వినగానే
ఆమె నిద్రమబ్బుని దూరంగా తరిమేసి
ఉషోదయ కాంతి కిరణాలలో
పరుగుల రాణి పి.టి.ఉష గా మారిపోతుంది...
మేఘావృతమైన ముఖానికి
చిరునవ్వుల చిలకరింపు నగిషీలద్ది
మాడ్పు పెనాలపై
లాలింపు నూనె పోసి
అట్టుల వడ్డింపు వేస్తూ
సంసార నావను కూనిరాగాలే పాడుతూ
సవ్యసాచిగా రూపాంతరమే చెందుతు
ఇంటిల్లిపాదికి సుప్రభాతమే వినిపిస్తుంది...
నిష్టగా క్రమశిక్షణా గీతమాలపిస్తూ
విద్వత్తు ఒడిలోకైనా
విద్యుత్ శాఖ లోనైన
విస్తరించే మహిళా వృక్షమై
ముచ్చటగా స్థిరపడుతుంది...
అవాంతరాల జడివాన లోను
తుఫానుల హోరులో ను
ధైర్యం వీడని స్త్రీ మూర్తిగా
తడబడక పొరబడక
అపాయంలోను ఉపాయంగా
పయనించే శక్తి స్వరూపిణి
మన నేటి మహిళ....

-డా॥రాధా కుసుమ
9989241319

## బ్రతికి చూపెట్టడం మనిషి లక్షణం

చావడం కన్నా బ్రతకడం మిన్న
సచ్చి సాధించేది ఏముంది.
బాధలు రానిది ఎవడికి
భయాలు పడనిది ఎవడు.
పిరికివాడిలా చావడం కాదు జీవితం అంటే ఒక సాహసం
దాని వేనుక పరిగెతడమే మనిషి జీవితం.....
తప్పటడుగులు వేస్తూ నడక నేర్చుకున్న నీవు
కష్టం వస్తే కన్నీరు కారిస్తే బాదోస్తే భయంవేస్తే
చావే పరిస్కారం అయితే ఇక్కడ బ్రతికేదేందరు రా మనిషి మానుకో
ఆత్మహత్యల ఉగ్గుపాలు తాగడం మానుకో
ఆనాటి వీరుల త్యాగాలు గుర్తుతెచ్చుకో
మెడ తెగిపాడిన ఆ పోరాట స్ఫూర్తినీ ఒకసారి గుర్తుతేచుకో
ఒక్కసారి జబ్బున పడ్డ రోగులను చూడు
బ్రతుకు మీద ఆశలు చిగురిస్తాయి
చావడం కాదు సమాజానికి మనం ఇచ్చే సందేశం
బ్రతికితే రాజులా బ్రతుకు
బ్రతికినన్నాళ్లు నవ్వుతూ నవ్విస్తూ బ్రతుకు ఆత్మహత్యలు వద్దు
బ్రతకడమే ముద్దు గుర్తుపెట్టుకో బ్రతకడమే ముద్దు....!!

-ఈగపాటి రంజాన్
7989751750

## మాఇంటి మహాలక్ష్మి

పలుకుల..చిలుకలా నా గృహలక్ష్మి
ఇంటి లో మాధుర్యం నింపుతుంది,
కఠిన క్షణాల్లో కూడా సహనంతో
నవ్వుతోనే సమాధానం చెబుతుంది.
రాగాలకోయిలలా..అలసినపుడు
మనసుకు సంగీతం పంచుతుంది,
కష్టము వచ్చిన వేళల్లో ఊరటనిచ్చే
ఆమె స్వరమే నాకు గొప్ప ఔషధం.
ఆకాశవీధిలో మెరిసే తారకలా
విశాలమైన ఆలోచనలతో,
కుటుంబానికి దారి చూపే
బలమైన నమ్మకంగా నిలుస్తుంది.
ముత్యాల..ముగ్గులా ప్రతి ఉదయం
ఇంటి ముంగిట శుభం అల్లుతుంది,
ఇల్లే దేవాలయమై కళ కళ లాడుతూ
ఆమె నా యింటి మహాలక్ష్మి అయింది.

-కానుకొలను వేంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు
9948515560

## సంబంధమే

పసిపిల్లల నుండి ముసలి వాళ్ల వరకు సోషల్ మీడియా ప్రభావమే..
చరవాణి పుణ్యమా అంటూ పుట్టుకొచ్చిన మాయదారి ప్రవర్తనలే ..
పాలు తాగే వయసు నుంచి చిత్రాలు వీడియోలు చూసే మనస్తత్వాలే..
నిత్యం సమాజంలో చాలామంది తెలియకుండానే చరవాణికి బానిసలే..
ఇన్స్టాగ్రామ్ ఫేస్బుక్ ట్విట్టర్ వాట్సప్ వంటి వాటిలో మునిగిపోయే స్వభావాలే..
అనైతిక ప్రవర్తన అసభ్య పదజాలాల భావన నిండిన వైనమే..
ఎవరికి ఎవరో తెలియని ముసుగు మనుషుల మోసాల మర్మమే..
కులమత వర్గ భావాలను నింపే విష గుళికల సమాహారమే..
అశ్లీల భావాలతో గాలాలు వేసే మోసగాళ్ల కుతంత్ర వలల అంతర్జాలమే..
సైబర్ నేరాలకు అమాయకులను బలి చేసే నరకపు పాశమే..
తెలిసి తెలియని వయసులో మాటల మర్మాలు తెలియక చిక్కుకొనే గాలమే..
ఆకర్షణలకు అనాలోచిత చర్యలకు బాధ్యుల్ని చేసే మాయాజాలమే..
కాలక్షేపం ముసుగులో సమయాన్ని హరింపజేసే పద్మ వ్యూహమే..
పనికిమాలిన విషయాలను మనసులో ఎక్కించే సిరంజీ తత్వమే..
అనాగరిక ప్రవర్తనకు అసహజ భావజాలానికి మూల కేంద్రమై నిలుస్తున్న బిందువే..
తప్పుడు వార్తలకు మోసపూరిత ప్రకటనలకు అవకాశం ఉన్న వ్యవస్తే..
గోరంతలు కొండంతలుగా కొండంత గోరంతలుగా ప్రదర్శించే మాయే..
అక్షరాస్యులను సైతం అజ్ఞానులుగా మార్చగలిగే సాధనమే..
చుట్టూ ఉండే సమాజ స్థితిగతులను తెలుసుకునే అంతర్జాల సంబంధమే..

-డి.టి.హేమంత్ సింగ్
8121430560

పుస్తక సమీక్షలు

# నిర్మాణాత్మక సందేశం గల "పరామర్శ"

తెలంగాణ మట్టిలో అస్తిత్వ ఉద్యమం, ఆత్మ గౌరవ ప్రగాఢ భావన సాహిత్య ప్రస్థానానికి కొత్త దారులు వేసింది. లబ్ద ప్రతిష్టులైన రచయితల మీదనే కాకుండా, విస్మరించబడి వెలుగు చూడవలసిన ప్రతిభావంతులపై దృష్టి కేంద్రీకరించే సాహితీ చైతన్యం రాష్ట్ర సాధనోద్యమంలో అంతర్భాగమైంది. 'రచనల చెరువు సాహిత్య వేదిక' ప్రచురించిన **'పరామర్శ'** రచయిత నక్క హరి కృష్ణ "నన్ను కన్న ఈ నేల తల్లికి' సంపుటి సమర్పించారు. పరామర్శలో, మలి దశ తెలంగాణ ఉద్యమంలో సాహిత్య సంస్థల పాత్ర తొలి వ్యాసంగా 12 వ్యాసాలు చోటు చేసుకొన్నాయి. తెలంగాణ భాష, అనుభవించిన అవ మానాలు, రచయితల అగచాట్లు, ఉద్యమ నేపథ్యంలో సందర్భాను సారంగా వెల్లివిరిసిన సాహితీ చైతన్యం మూలాలను రచయిత అక్షర బద్ధంగా విశదీకరించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి- ప్యారక శేషాచార్యులు, తెలంగాణ బాల సాహితీవేత్త డాక్టర్ భూపాల్, మట్టి పరిమళాల జల్లు- పల్లెపూల వాన, మనాది యాది, సబ్బండ నాదం- వాగ్గేయకారుడు, అద్భు తంగా అక్షరీకృతం చేయ టం, తెలంగాణ తల్లి మట్టి పరిమ ళాల ను గుబాళింపచేసారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధించే ఆకాం క్ష, కవు లు, రచయితలు, కళాకా రులు, సామా న్యులు దోపిడీ, అణ చివేత, నిర్లక్ష్యానికి గురి అవుతున్న నేపథ్యాన్ని రచయితల వేదిక, సమాఖ్య, సంఘం ఎదుర్కొన్న త్యాగ, పోరా ట చరిత్ర ఈ వ్యాస సంపుటి వివరించింది. **'తొలి నాళ్ళ సోయి'** వైతాళిక పాత్ర, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా, అస్తిత్వ పోరాటానికి వెన్నుదన్ను గా, బడుగు బతుకుల అట్టడుగు వేదన, బాధల వ్యథ అక్షర సత్యాలుగా **'పరామర్శ'** ప్రతిబింబింప చేస్తోంది. 'రచనల చెరువు సాహి త్య వేదిక', ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత స్వల్పకాలికంగా కొంత మేర ఏర్పడిన స్తబ్దత, తొలగించటానికి చేస్తున్న సత్కృషి, తెలంగాణ నవ నిర్మాణానికి ప్రాధాన్యత యివ్వటం అభినందనీయం. వ్యాస సంపుటి అనుబంధంలో ప్రచురణకర్త డా॥ బెల్లంకొండ సంపత్‌కుమార్, ఈ వ్యాస సంపుటి అందించే నిర్మాణాత్మక సందేశాన్ని ఆదరించవలసిన సందర్భాన్ని విశ్లేషించారు. వ్యాస సంపుటి రచయిత నక్కహరి కృష్ణ ప్రదర్శించిన అక్షర నిబద్ధత, శోధన, పరిశోధన ప్రశంసనీయం.







**ప్రతులకు:** డా॥బెల్లంకొండ సంతప్‌కుమార్, 1-5-328/1 సూర్యానగర్, ఓల్డ్ అల్వాల్ సికింద్రాబాద్-10. సెల్:9908519151



-జయసూర్య
9440664610

# జీవన యానం..మలుపులమయం...

సాఫ్ట్‌వేర్ బ్రతుకుల మధ్య అంత 'సాఫ్ట్'గా లేని మనసుల మధ్య కాలంవెళ్ళ బుచ్చుతోన్న ప్రపంచం ఇది. పచ్చని పల్లెలు, పొలాలు పక్షుల కలకలారావాలు, ఆవుల అంబార్వాలు దూరమై కార్ల హారన్‌లు, కాంక్రీటు అరణ్యంలో ఎవరికి వారై బ్రతుకీడు స్తున్న కాలమిది.

ఎభై ఏళ్ళ సాహితీ ప్రయాణంలో రచయిత్రి డా॥లక్ష్మి రాఘవ రెంటినీ చూసారు. ఏది గొప్పది అన్న ప్రశ్నకు వారి వద్ద జవాబులేదు. ఈ రచయిత్రే కాదు, ఎవరి వద్దా జవాబు ఉండదు, మారుతోన్న కాలానికి అనుగుణంగా మారుతూ బ్రతకటం తప్ప. సమాజపు కోణాలను తాకుతూ సాంకేతికత తీసుకొచ్చిన కొత్త మార్గాలపై అడుగులు వేస్తూ, పాతతరం విలువలతో కొత్తతరం మెలకువల మధ్య సాగే మలుపుల ప్రయాణమే నేటి జీవితం. అవే ఈ **"మలుపు"** సంపుటిలోని 27 కథలు. అందుకే ఇవన్నీ కథల్లా లేవు, నేటి జీవితాల్లా ఉన్నాయి. సముద్రాలు దాటితే ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిన కాలం నుండి, సముద్రాలు దాటితే తప్పకాలం గడవని ప్రయాణంలోని మలు పుల్ని ఏకరువు పెడుతున్నారు రచయిత్రి ఈ కథల్లో. పాదాల పారాణి ఆరక ముందే చార్‌ధాం యాత్రకు వెళ్ళిన కూతురు పల్లవి అల్లుడు శ్యామ్‌ల ప్రయాణంలో భారీ వర్షాల వల్ల నదీ ప్రవాహంలో కొట్టుకుపోతాడు శ్యాం. పల్లవి జీవితంలో ఇదో పెద్ద మలుపు. ఈ మలుపు వద్దే పల్లవి జీవితం తెలవారవల్సిందేనా? వీల్లేదు అంటారు రచయిత్రి. తన ప్రాణాలు పణంపెట్టి పల్లవినీ, మరి కొందరు యాత్రికుల్ని కాపాడి పల్లవిని ఆమె తలిదండ్రులకు క్షేమంగా అప్ప చెప్పిన ప్రకాశ్, పల్లవి జీవితంలో చోటు చేసుకున్న 'మలుపు'కు సమాధానం చేసారు రచయిత్రి 'మలుపు' కథలో. విషాదం మలుపు తిరిగి సుఖాంతం అయింది.

వయసుతో పాటు శరీరానికీ రిపేర్లు వస్తాయి. కొరుకు రాగం సిగరెట్లు, మందు మరే దుర్వసనం లేకున్నా, ఈ రిపేర్లు తప్పవు. అంత మాత్రాన బి.పి. పెంచు కోవద్దు. అవి వయసుతో బాటుగా శరీరానికి వచ్చే రిపేర్లు అంటారు. ఇదే టైటిల్ ఉన్న కథలో.

మనసున మనసై బ్రతుకున బ్రతుకైన శంకరం **'తోడు'** విడిపోతుంది మాలతికి. నాలుగు నెలల ఆస్పత్రి జీవితంలో పేషెంట్ కంటే తోడు ఉన్న తాను అనుభవించింది. ఏ క్షణాన్న ఏ దుర్వార్త వినాల్సి వస్తుందో అన్న భయం. భయంలోంచి పుట్టుకొచ్చిన వెలతి ఆమె గుండెల్ని ఎండింప చేసింది. భయపడిన ఘడియ రానే వచ్చింది. శంకరం నిర్జీవ శరీరం ప్రక్కన కూర్చున్న మాలతికి కన్నీరు రావటం లేదు. ఎదురు ఉన్న పార్థివ శరీరం లాగే ఆమె మనసు కొయ్య బారింది. అంతిమ సంస్కారాలప్పుడూ అంతే! మహా ప్రస్థానం బండి ఎక్కి కనుమరుగవుతున్న చివరి అంకంలో గట్లు తెగి తన్నుకు వచ్చింది కన్నీరు. 'రచయిత్రి గుండెనే సరయ్యిందా' అన్నంత సహజత్వం చూపిన కథ కంటనీరు.

సరళమ్మ మనవరాలు హన్సిక, అమెరికా, రోజూ హన్సిక అమ్మమ్మతో మాట్లాడకపోతే తోచదు. అయితే- హర్శిక జీవితం మలుపు తిరిగి అమ్మమ్మ స్థానాన్ని మనవరాలి స్కూలు, క్లాసుమేటు క్లాసురూము ఆక్రమించుకుంది **'మన వరాలి ప్రేమ'**లో. తనదే అనుకున్న మనవరాలి ప్రేమ కాస్త మలుపు తిరిగితే అమ్మమ్మ సరళమ్మ దాన్ని తేలికగా తీసుకోవాలని ఈ కథ చెబుతుంది. చుట్టూ ఉన్న ప్రపంచం విస్తృతమవుతూ, అమ్మమ్మ మీది ప్రేమ కాస్త పలుచబడటం సహజం అంటారు రచయిత్రి.

శబ్ద తరంగాల్లో రంగులు ఉంటాయా? ఉంటాయంటుంది రచయిత్రి **'శబ్దశాంతి'**లో. ఇదే విషయంపై ఏకంగా ఓనవలే రాసారు సలీం అనే ప్రఖ్యాత నవలాకారులు. దీన్నే 'సినెస్తీషియా' అంటారని తెలుసుకుంటాము. **'శబ్దాల శాంతి'** కథ చదివి. అమెరికాలో స్థిరపడిన పిల్లలకు తలిదండ్రులకు తమ వెంటే ఉంచుకోవాలనిపించటం సహజం. అరవయ్యేళ్ళు ఇండియాలో ఉన్న వాళ్ళకు అమెరికా కంటే ఇండియానే బాగుంటుందని చెప్పే **'ప్రాధాన్యత'** కథ

కవులు, కథకులు, సాహితీవేత్తలు ప్రొటాగనిస్టులై (వైతాలికులై) ఉండాలి. సాఫ్ట్‌వేర్ జీవితం దేశవ్యాప్తంగా పెనుమార్పు తెచ్చిందన్నది అవివాద సత్యం. ఈ సాఫ్ట్ వేర్ జీవితాలు, **'అంకుర'** పరిశ్రమల తర్వాత ఏమవుతుందో.. మళ్ళీ వాళ్ళు ఇళ్ళబాట పట్టి వ్యవసాయం లేదా మరో వ్యాపకంలో దిగిపోతారు అన్న భవిష్య త్తులోకి రచయిత్రి చూసిన చూపు అభినందనీయం. తత్త్వవేత్తల కంటే రాజకీయ నాయకులకంటే, ఆర్థిక శాస్త్రవేత్తలకంటే రచయితలు ఓ పదేళ్ళు ముందుకు చూడగలగాలి **'వెలుగు వేసవి'** కథలో రచయిత్రి ఇదే ఊహించారు.ఎదగటానికి పరుగులు తీయనక్కర లేదు. సిటీలో టెక్నాలజీ పెరిగిపోతూ ఆత్మీయతలకు దూరం అవుతున్నారు.

మనకున్నది అందరికీ పంచినప్పుడే నిజమైన సంతోషం

చట్టం భయపెడుతుంది. మానవత్వం కాపాడు తుంది.

బయటవేసే నిబంధన కంటే మనసులో ఉండే నిబందన గొప్పది.


మంచి చేస్తే మంచే తిరిగి వస్తుంది.

మనమేమో (భారతీయులు) ఉన్న దాంట్లో కొంచెం మిగుల్చుకుని బతికిన వాళ్ళం

ఎదుగుతున్నానా.. లేక నన్ను నేనే ఎక్కడో పోగొట్టుకుంటున్నానా?

కష్టాలు ఎవరికీ చెప్పుకునే రోజులు కావి వి- లాంటి మంచి మంచి వాక్యాలు కొల్లలు. చాలా కథలు అంతర్జాల పత్రికలను ద్దేశించి వ్రాసారు. కనుక క్లుప్తత సంక్షిప్తత పాటించారు రచయిత్రి. ఒంటరి తనం ఉద్వేగంగా, నిశ్శబ్దం భయంకరంగా.. కనబడని కన్నీటిని కలంలోకి మళ్ళిస్తూ, అక్షరాలతో మాట్లాడుతూ కాలంతో పాటు నడవాలని ప్రయత్నిస్తున్న రచయిత్రికి ఒక విన్నపం.

అమ్మా! జీవితంలో వెలుగు చీకటులు కష్టాలు సుఖాలు పూవులు ముళ్ళూ సహజం. మీరెన్నుకున్న ఈ రచనా వ్యాసంగంలో మిమ్మల్ని మీరు మరిచి పోయి ఓదార్పును వెదుక్కోండి. జీవనయా నమే 'మలుపుల' మయం.







**ప్రతులకు:** డా॥లక్ష్మీ రాఘవ 3-99, అన్నగారి స్ట్రీట్, కురబలకోట-517350 సెల్: 9440124700



- కూర చిదంబరం
సెల్: 8639338675

## కుక్క పిల్ల !!

మొత్తం రొట్టె కాదులేవోయ్ !!
చిన్న రొట్టెముక్క వేసినా
నీ వెంట వెంటే నీడలా దోస్త్ లా
ధర్మదేవతలా
తిరుగుతూ-
నీకు తెలిసి తెలియని విశ్వాసం గురించి
ఆచరించి చూపుతుంది!.
అప్పుడు నువ్వు పోకడగా-విశ్వాసం గురించి
సభలలో భాష్యం చెప్పుతూ
డాక్టరేట్ కొట్టేస్తావ్ తెలివిగా !
పేరుకే కుక్క పిల్ల !
విశ్వాసం పేరుగల కుక్క పిల్ల !!
(" శ్రీశ్రీని" స్మరిస్తూ )

-కందాళై రాఘవాచార్య
87905 93638

## చిరునవ్వుంచండి

దేవుళ్ళ కంటే గొప్పవారు
మన తల్లిదండ్రులు
దేవుడు అడిగితే ఇస్తాడేమో
అడగకుండానే ఇచ్చేవారు తల్లిదండ్రులు.
దేవుడి కష్టమైతే మనం చూడము కానీ
తల్లిదండ్రుల కష్టాలను మాత్రం చూస్తాం
వాళ్ళు కష్టాల సుడిగుండంలో ఈదుతున్నా
మనల్ని మాత్రం
సుఖాలతీరానికే చేర్చుతారు.
మనకు దారిచూపే వెలుగుదివ్వెలు వారు
వాళ్ళను బాధ పెట్టకండి
అడుగడుగునా తోడుండే
స్నేహితులు వారు
వాళ్ళ చేయిని ఎప్పుడూ వీడకండి
మనకు నిత్యం
ప్రేమను పంచే ప్రేమమూర్తులు వారు
ప్రతిగా వాళ్ళపెదాలపై చిరునవ్వుంచండి

- నున్నావత్ స్నేహ

## ఆకాశాన్నంటే మేడ

ఆకాశాన్నంటే మేడ తాటిచెట్టు
ఎందరి దాహమో తీర్చగలిగే శక్తి
దానికుంది
దాని ఎత్తు
మనల్ని తలెత్తుకునేలా చేస్తుంది
పెద్ద పెద్ద గెలలుగా ఉన్న
ముంజలని
అది మోస్తుంది
తాటి చెట్టు చాలా మందికి
ఆధారంగా ఉంటుంది
గీత కార్మికుల జీవితానికి
అర్థం పరమార్థం
ఇచ్చేది తాటిచెట్టే
కుమ్మరి వారికి సారె ఆధారం
ఔసలి వారికి సుత్తి ఆధారం
వడ్ల కమ్మరులకి కొలిమి,
దాతి ఆధారం
గౌడన్నలకి తాటి చెట్టు ఆధారం

- మామిడి భార్గవి

## సర్వ కారకం !

మనిషేమి వాడు మనసు లేక
ఇంకేమి వాడు మూగి,మౌని గాక
మనసే మనిషికి,మౌనికి బాసట!
మనసు ఉంటేనే జీవికి ఊరట
మనసు లేక లోకం శూన్యమట!.
మనిషికి మనసే సారథి
సర్వ వ్యవహారాల వారధి
లోకం మనసున్న వారిది
మనసు లేని మనిషిని
పట్టించుకోని లోకం తీరిది!.
మనసు క్షణాలలో లోకాలోకాలను
చుట్టివచ్చే ,చంచల
సంకెళ్ళు లేని గుర్రం
అది సర్వాంతర్యామి గా
అంతా అన్నింటికీ తానేనంటుంది!
మనసు లేని మనిషికి
ఏమి తెలుసు
మనిషి మనసు చెక్కిన లోకం
నిరాకార
చంచల మనసే సర్వ కారకం!

-పట్లోళ్ళ బక్కారెడ్డి



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

## అమ్మ బాగున్న ఇల్లు

అమ్మ బాగుంటేనే
ఇల్లు బాగుంటుంది
అమ్మ బాగాలేకపోతే
ఇల్లు ముఖం మాడ్చుకుంటుంది
వాకిలి దూపతో ఏడుస్తుంది
పొయ్యి రాజసాన్ని కోల్పోతుంది
దీపాంతల్లో
దుమ్ము నిండుకుంటుంది
ఇల్లు కళదప్పుతుంది
ఎంతైనా అమ్మ అమ్మే
తను అనారోగ్యంతో ఉన్నా
నా పిల్లలు
ఎలా తింటారోనని బాధపడి
తనకు కష్టమైనా వండిపెడుతుంది
అమ్మ బాగున్న ఇల్లు
ఆనందాల హరివిల్లు

- పల్లె సాహితి

## చందమామ

చందమామ
నల్లని మేఘాలలో
మెరుస్తున్న ఓ మల్లెపువ్వు
చుక్కలకి తను
రాజులాగ తోడు ఉంటాడు
మన కోసం చీకటితో పోరాడుతూ
అడుగడుగునా వెలుగు నింపుతాడు.
చిన్న పిల్లలకి
తను మిత్రుడిలా ఉంటాడు
పిల్లల ఏడుపును చూసి
మేఘాలలో
దాగుడుమూతలాడతాడు.
చీకటిని తరిమేసి
వెన్నెలని పూయిస్తాడు
తనను చూడడానికి
అందరూ తల ఎత్తుకునేలా
అందనంత ఎత్తులో ఉంటాడు


- పసుల.మృదుల

## పుస్తకాల సంచి

నాతో ఉంటూ
నాతో మోపిస్తూ
నాలో సగం బరువవుతుంది
పుస్తకాల సంచి.
నాకు
చదువుకునే సమయం
వచ్చిందని చెబుతూ
ఎప్పుడూ నన్ను హెచ్చరిస్తుంది
ఇంటికి వెళ్లే సమయం రాగానే
నా భుజాల పై వాలుతుంది.
అది మా నాన్న తెచ్చిన సంచి
తనలో దాచుకున్న పుస్తకాలను
ఇంటికి వెళ్ళగానే
చదువుకొమ్మని చేతికిచ్చి
జీవితంలో
ముందుకు సాగమని చెబుతుంది.
పాఠశాలలో
ఉపాధ్యాయులు చెప్పే పాఠం
తనూ వింటు
నన్నూ వినమని చెబుతుంది
జీవితంలో వీరుడిగా
ఎదగమని చెప్తుంది.
తన కోసం కాకుండా
నాకోసం కష్టపడుతున్న
దానికి నేనేమివ్వగలను
వారానికోసారి శుభ్రంగా పిండి
తెలుపుదనమివ్వడంతప్ప.

- మంగలి దశ్వంత్

# భక్తుల పాలిట అండ "కోటప్ప కొండ"



ఓం నమశ్శివాయ అన్నా, శంకరా అన్నా, శివ శంభో అన్నా, ఇలా ఏ పేరుతో పిలిచినా "ఓయని" పలుకుతాడు ఆ పరమశివుడు. కాశీ విశ్వేశ్వరుడు, శ్రీశైలం మల్లన్న, కాకాని మల్లేశ్వరస్వామి, కీసరగుట్ట శివయ్య, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో దివ్య క్షేత్రాలు, ఎన్నో పేర్లు, శివుడికి చీనీ చీనాంబరాలు రత్నాభరణాలు, నగానట్రా ఏమీ అక్కరలేదు. రెండు చేతులూ జోడించి మనసారా నమ స్కరించి, చెంబుడు నీళ్ళతో అభిషేకం చేస్తే చాలు, కుషీ, అంతటి అల్ప సంతోషి. తిరిగి వరాల జల్లులు కురిపిస్తాడు. మన పొరుగు రాష్ట్రంలో గుంటూరు జిల్లా నరసరావు పేట తాలూకాలో దక్షిణ దిశగా ఒక చక్కని కొండ ఉంది. ఆ కొండ ప్రశిద్ధ పురాతన శైవ క్షేత్రాలలో ఒకటి.

అక్కడ ఉన్న బ్రహ్మశిఖరం, విష్ణుశిఖరం, రుద్రశిక్షరం అన్న మూడు శిఖరాలను బట్టి ఆ ప్రాంతానికి "త్రికూట' పర్వతం అని పేరు వచ్చింది.

విశేషం ఏమిటంటే ఎటునుండి చూచినా ఆ మూడు శిఖరాలూ కనిపిస్తాయి. అదే ఆ పర్వత ప్రాధాన్యత. కొండ మీద ఆరు వందల అడుగుల ఎత్తులో త్రికోటేశ్వ రాలయం వుంది. దానిని కొత్త త్రికోటేశ్వ రాలయం అంటారు. ఎందుకంటే, కొద్దిగా దిగువలో పాత కోటీశ్వరాల యం కూడా ఉంది. అది రుద్ర శిఖరం మీద ఉంది. ఇక్కడ జ్యోతిర్లింగం లేకపోవడం వల్ల, బ్రహ్మదేవుడు శివుడి గూర్చి ఘోర తపస్సు చేసాడనీ శివుడు ప్రత్యక్షమై జ్యోతిర్లింగంగా వెలిశాడనీ ప్రతీతి. ఈ ఆలయానికి ఉత్తరంలో "యల్లమంద" కోటేశ్వరాలయం ఉంది. పూర్వం అక్కడ మునులు గుంపులు గుంపులుగా నివశించే వారనీ, అందువల్ల ఆ ప్రాంతానికి "మునిమంద" అనే పేరు వచ్చిందనీ అలా మందలు మందలుగా నివశించడం వల్ల "యల్లమంద" గ్రామంగా పేరు వచ్చింది. అందుకే అక్కడి స్వామి ని "యల్లమంద కోటయ్య" అని పిలుచుకుంటారు భక్తులు.

కొత్త కోటేశ్వరాలయానికి దక్షిణంగా గణపతి దేవాలయం, పడమరలో సాలంకేశ్వరాలయం, ఉత్తరాన సంతాన కోటేశ్వరా ల యం ఉన్నాయి. ఆ స్వామిని దంపతులు దర్శిస్తే సంతానం కలుగుతుందని నమ్మకం.

అక్కడి "బొచ్చు కోటే శ్వర" స్వామి సన్నిధిలో తలనీలాలు సమర్పించుకుని "ఓగేరు" అన్న నదిలో స్నానం చేస్తారు భక్తులు.

ఆంధ్రదేశంలో జరిగే ముఖ్యమయిన తిరునాళ్ళలో కోటప్ప కొండ తిరునాళ్ళు చాలా ప్రశిద్ధి చెందినవి. "మహా శివరాత్రి" నాడు భక్తులు పెద్ద పెద్ద "ప్రభలు" కట్టుకుని ఉత్సవం జరుపుకుంటారు. ఆ సమయంలో 400,500 ప్రభలు దాకా దర్శనమిస్తాయి. ఏకాదశ రుద్రభిషేకాలు, సహస్ర నామాలు విరివిగా జరుగుతాయి.

వీరంగాలు, శరభ శరభలు, కోలాటాలు. వీరభద్రునిపళ్ళాలు, హరికథలూ, పురాణాలు బాగా జరుగుతాయి.

అక్కడ అన్ని వర్గాల వారికే ధర్మసత్రాలు ఉన్నాయి. యాత్రికులకు నిత్యాన్నదానాలు జరుగుతూంటాయి.

కోటప్ప కొండను దర్శించి ఆ శివుని ఆరాధించడం, అభిషేకించడం, ఒక అద్వితీ యమైన అనుభవం.




-డా॥పంకజ మల్లిక్
సెల్:98660 65462



# హృదయావిష్కరణ



ప్రతులకు: తిరుమల వెంకట స్వామి
ఎక్స్-ప్రిన్సిపల్ & కరస్పాండెంట్
ప్రీమియర్ కో ఎడ్యుకేషన్ అకాడమీ
మాతానగర్-పంజగుట్ట
భాగ్యనగరం-హెచ్.వై.డి.
హైదరాబాద్. సెల్:9391109616

**తిరుమల వెంకటస్వామి 'కవితావిక' సంపుటికి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీమతి కొలకలూరి మధుజ్యోతి గారు రాసిన ముందు మాట...**

శ్రీ టి.వి. స్వామిగారి 'కవితావిక' వారి అంతరంగ ఆవిష్కరణ. సుదీర్ఘ రచనగా వున్న ఈ పుస్తకం రెండు రూపాలలో దర్శితం. శీర్షికాయుక్త కవితలూ, శీర్షికాతీత కవితా ఖండికలు సమాన భాగస్వామ్యం పొందిన గ్రంథజం

పద్య వచన రూపాలలో సరళ గ్రాంథిక వ్యక్తీకరణతో సాగిన కవి తలు ఇవి. కొన్ని గేయ ధోరణిలో ఉన్నాయి. పద్యమైనా వచనమైనా అధిక శాతం కవితలు ఆధునిక దృష్టికోణ ప్రదర్శితాలే. భావాలలో సంప్రదాయ ప్రీతి లేకపోలేదు. సీస పద్యం పట్ల అధిక ప్రేమ కలిగిన కవి ప్రయత్నం అభిలషణీయం. పట్టుకై కృషి చేశారు. ప్రాసకు (టకారాలు, నాణ్యత, పు.167) పట్టం కట్టిన సందర్భాలూ ఎన్నో.

కవిత్వ సౌందర్యమంతా భావా భివ్యక్తి లోనూ భాషా సారళ్యంలోనూ ఉంది. సాంప్ర దాయకత భావుకత ఆధునికతల సమ్మేళనం ఈ కవితావిక.

శ్రీ టి.వి. స్వామిగారిది భక్తి మార్గం. భగవత్ ధ్యాస ధ్యానం అధికమే. భారత భాగవతాలపై పట్టు ఉన్న ఈ కవి భగవత్ విశేషాలను పారమ్యాన్ని (సత్య వ్రతము) కీర్తించారు. 'తరుమూషికం' పునీతగా చిత్రిం చారు. భగవత్ 'ఆలింగనం' కాంక్షించారు. ఆయా మత గ్రంథాలు సభ్యత సంస్కారాలను శ్రేష్టతను కలిగి ఉన్నాయని భావించారు. గద్వాల చెప్పున్న కేశవా! అనే మకుటంతో రాసిన ఎన్నో ఖండికలు సామాజిక ఆధ్యాత్మిక వినయంతో చేసిన ఆత్మ నివేదన.

తాత్త్వికదృక్పథం మనిషి మనుగడకు అవసరం. జీవితం పట్ల నిర్దిష్ట దృష్టి ఉండక పోతే మనిషి ఐహికానం దాల ఊబిలో కూరుకుపోతాడు. మంచి చెడు విచక్షణ లేకపోతే పతనం అవుతాడు. **'నీ కర్మకు నీవే బాధుడవు'** (తత్త్వగీతం) అంటూ ఉపదేశిం చారు. **'కొనిపోలేని ఆస్తులు కూడగట్టుకుని' మనిషి'** (అమానుషుడు) అవుతున్నాడని నేటి మనిషి పట్ల దుఃఖాన్ని వ్యక్తం చేశారు. **'బాల కౌమార యవ్వన వృద్ధాప్యములు/ నాలుగు నలుగురి కప్పజెప్పు/ వంద వెయ్యి లక్షకోట్లై గడించినది చాలని/ బొంద కడకే మనిషినప్ప జెప్పు** (పు.176) అంటూ జీవిత పరమార్థ స్పృహని కల్పించారు. జనన మరణాల మర్మ మెరుగని జీవితం ఎవరిదీ కారాదని చాటారు.

సనాతనలో ఘనతను చాటడంలో కవి ఆనంద పులకితుడు. ఆయుర్వేదంలోని ఘనత ను, వంటింటి చిట్కాలలోని సులువును బలం గానే వ్యక్తం చేశారు.

భారతీయత హిందూ ధర్మం కలగలిసిన సాంప్రదాయ స్త్రీత్వాన్ని కట్టూ బొట్టును చూసి గర్వించే కవి, అధునాతన మహిళల వేష భాష లు తీరు తెన్నులను (యవనిలు: పు.164, 165) నిరసించారు. సంపూర్ణ హిం దూ భావజాల ప్రతీకగా కవి నిలిచారు. అలాగని మహిళ ఉత్తమత్వాన్ని తగ్గించలేదు. **'మగ వాడి బ్రతుతకు వాడిది కాదు పెళ్లి పిదప/ మగువ తెగువపై ఆధారపడి యుండ/ నగవు వలపు తలుపు మలుపు/ నగవు కూడా వారి అభయమందే'** (పు. 131) అని మహిళ ఘనతను చాటారు.

ఈ కవితలలో రాజకీయ స్పృహ చైతన్యం చురకలు ఎన్నెన్నో. రాజకీయ నాయకులను **"కొన్ని కొన్ని ఈ చేత ఇచ్చి అన్ని వడ్డీతో వసూలు చేయు వడ్డీ వ్యాపారులు"** (విదేశాలు) అన్నారు. వీరికి పాలనా ప్రాంతాలు. ప్రజల క్షేమం, ఆరోగ్య విధివిధానాలు రహదారులు ధ్యాస లేదు. ప్రజాధనం దుర్వినియోగం చేయరాదని ఆలోచనా లేదు. రాజకీయ నాయకులు తమ కుతంత్రాలలో దేవుళ్లను కూడా విభజించేశారని (న్యాయం న్యాయ స్థానం) వేదన వ్యక్తం చేశారు.

వివిధ పార్టీల ప్రతినిధులు ఉండే శాస నసభ ఒక మాయా జాలంగా వారి దుమ్మెత్తి మాటలతో ఉంటుంది (పు.109) అని వేద నను వ్యక్తం చేశారు. శబ్ద వాయు కాలు ష్యాలను ఆపలేని పాలకులు **'దుమ్మెత్తి పోసిన దులుపుకుని పోయే/ దమ్మిడికి పనికిరాని మంత్రివర్యులు'** (పు.178) అంటూ నిరశించారు. రాజకీయ నాయకులు నిర్లజ్జ ధోరణికి విసిగిన వైనం ఇది. మంత్రి మండలులన్ని భజన మండలులు అయ్యాయి. ప్రజా ధనం తమ మనుగడకే అని అభిప్రా యం (186) ఉ ండటాన్ని నిరసిం చారు.

రాజకీయ నాయకులు అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా గాడిదలని **'నష్ట పోయింది ఓటర'**ని ధైర్యంగా పేర్కొన్నారు. వారిచ్చే మందు విందులను స్వీకరించే ఓటర్లు **'వారిని నిలదీయలేరు నక్కి ఉండవలసిందే'** (ఓటర్లు) నంటూ ఓటర్లలో మార్పును కోరారు. ఓటుకు నోటు తీసుఉంటే నమ్మి చెడిపోతావు. 'నీనిచ్చే కుర్చీని వాడెక్కి కూర్చొని/ నిత్యము వెన్నొంచు చుండ' (పు.206) నీకు గౌరవవేమ ుంటదని ఓటరును నిలదీశారు. మన ఓటు కొని **'మనపై వీరి పెద్దరికవేమమని నిలదీయ ప్రజలకు సిగ్గులేదు** (పు.212) అవి రాజకీయ నాయకుల ఆలోచననూ తెల్పారు.

రాజ్యాంగం కల్పించే రిజర్వేషన్లు, ఆ పేరుతో రాజకీయం చేసే కుట్రలు, దాని వలన ఆ చట్రంలోనే ప్రజలు నిల్చి ఉండిపో తున్నారని (ఓసీ-పాచీ) అంటారు.

న్యాయం చట్టాన్ని ఉల్లంఘించే వారికి చుట్టం అవుతూ ఉంది. న్యాయం ఇవ్వవలసిన న్యాయమూర్తులు న్యాయ కోవిదుల అన్యా యార్జన ఇటీవల దేశ రాజధానిలో అగ్నికి ఆహుతి కావటం బాధాకరం. అలా ంటి తీరును తతత్పూర్వవేమ రాశారు. **'తీర్పులిచ్చే న్యాయాధిపతులు తల లెగరేస్తున్నారు/ రాజ్యాం గ అంగాలను బహుమతులుగా వాడుకొం టున్నారు'** (కురుపులు) అని. ఆర్థిక నేరగాళ్లకు రక్షణ కల్పిస్తున్నారంటూ సమాజంలో న్యాయ వ్యవస్థ పతనాన్ని కళ్లకు కట్టారు.

కులం మతం ప్రాంతం ధనం గురించి, అవి కల్పించే దూరాల పట్ల కవికి అనంత వేదన ఉంది. **'వంచనతో పైకెదిగిపోయిన నిన్ను/ వంచన చేరనిచ్చునా నీ కులము.. / నా ప్రాంతము వాడివని వంత పాడవచ్చునో/ కులము మతము ప్రాంతము వాడిగా గాక/ మనిషిగా మసులుకో అన్నాడు'** (తత్త్వ గీతం). **'ఒకో కులానికి, ఒకో మతానికి/ ఒక్కో రకమైన శరీరావయవాలున్నాయా'** (ఉన్నాయా!) అని ప్రశ్నించాడు. ఈ జాఢ్యం పిల్లలకు చేరకూడదని (పెద్ద లారా!) కాంక్షించారు. మత విభేదాలు దైవ రూపాలు అవసరం (విలువలు) చాతుర్వర్ణాల జనులు ఆయా లక్షణాలతో జన్మించలేదు. కులమత ప్రాంత ధన హీనతలతో మనిషి మృగమవుతున్నాడని (పు.112) దురపిల్లారు. భగవంతుడు ఏది అవసరమో అదే ఇచ్చాడు అని విశ్వసించిన కవి కులం కంటే వృత్తే తిండి పెడు తుందని బలంగా నమ్మారు. కరోనా కాలం అందరిని మృత్యు భయానికి గురి చేసింది. ఆ మాయా జాలంలో కులమత ప్రాంత జాతులేవి నిలవ లేదు (కరోన).

సినీ రంగం పట్ల ఇసుమంత ఆకర్షణ కవికి ఉంది. దర్శకుల జాత్యుపకార చిత్రా లను, సినీ కవులను, శతాధిక చిత్రాల సంగీత దర్శకుడు అయిన ఘంటసాల గరిమను విశేషంగా కొనియాడిన కవి, నటుడు నాటి అగ్రతార నందమూరి తారక రామారావు పట్ల హృదయ దఘ్న ప్రేమను వ్యక్తం చేశారు. పౌరాణిక పాత్రలకు తగిన శరీరదారుఢ్యం ఆయా పాత్రలలో ఒదిగే నైపుణ్యాలకు మురిసిపోయారు.

రంభతో శాపం పొంది అయినా తిరిగి వచ్చి **'పోషింపని పాత్రల వేసి'** (అన్నగారు ఎన్.టి. రామారావు గురించి) వెళ్ళమని ఆహ్వానించారు. నటుడిగానే కాక పాలకుడిగా, ప్రజాధనాన్ని మోహించని నిజాయితీపరుడిగా వారిని చూసి గర్వించారు. వారి ప్రజా సంక్షేమ పథకాలను కీర్తించారు.

ఆధునికత సాంకేతికత కలసి ప్రయాణి స్తున్న కాలాన్ని కవి నిశితంగా గమనించారు. సాంప్రదాయాన్ని, పూర్వపు అలవాట్లని కాదని విదేశీ ఆచారాలకు లోనయి జీవిస్తున్నారు నేడు. **"ఒంటికి చెమట పట్టకపోతే/ ఆ వొళ్ళు కంపు తొట్లే/ శ్రమ లేని శరీరాలు నిద్రకు/ ముళ్ల పరుపులే'** (అవును) అంటూ స్పృహను కల్పించే ప్రయత్నం చేశారు.

గూగుల్ ఒక మాయాజాలం అది ఒక అద్భుతం **'ఏ మంత్రోపాసన'** చేశావు (గూగుల్) అంటూ ఆశ్చర్యపోయిన కవి, సెల్ ఫోన్‌కు బానిసలు అవుతున్న మాన వజాతికి అది మాయాదర్ప ణంగా (పుస్తకం), ఎడతెగని బంధంగా హస్త భూషణంగా ఉండటాన్ని చూచి విస్మయం చెందారు. సాంకేతి కత అభివృద్ధి దోహదవే కాదు పతనాలకు నెలవుగానూ (పు.129) చూపారు. సామాజిక మాధ్యమాలకు మంచి చెడుల విచక్షణ లేనితనాన్ని గుర్తించారు.

యువత పెడదారిన సాగుతూ ఉ ంది. తిండిపై శరీరంపై ఆరోగ్యంపై శ్రద్ధ లేని తీరు తో సమాజానికి భారం అవటాన్ని (గంపగుత్త) నిరసించారు. యువత పెడతోవ తొక్కుతుంటే, వారికి కావలసినవి ఇస్తూ తల్లిదండ్రులు వారిని మరింత పతనానికి కారణం (గబ్బు-డబ్బు) అవుతున్నారు. **'యువత పబ్బు క్లబ్బు బారెండ్ రెస్టారెంట్ల/ బానిసలై వారి ఊడిగము సల్పి'** పతనం అవుతున్నారని కవి చింతిల్లారు. **'ఇంటి వెచ్చాలతో బాటు.. క్వాటర్లు హాఫ్ బాటిళు నిండిపోయె** (పు.139), ఆర్థిక క్రమశిక్షణ నేటి తరానికి లేదు. దానిని పలుమార్లు కవి హెచ్చరిస్తూనే ఉన్నారు. **'ఆదాయ న్యాయాల వ్యత్యా సాల తీరు/ నేటి నూతన కుటుంబీకుల రయకుండ్రి/ నియం త్రించవలసిన పాలనా యంత్రాం గమ్ము/ సీలలూడి పోయి తుప్పు బట్టి పోయె** (149) అన్నారు. ఇలాంటి జీవన శైలి కవి దృష్టిలో ఏమాత్రం అభిలషణీయం హర్షణీ యం కాదు.

వృద్ధాప్యం ఇచ్చే వెరపు అనుభవిం చాల్సిందే. 'రిటైర్' అయితే ఇంట్లో చులకన అవుతాననే బెదురు. శరీర శక్తి తగ్గుతుంది. **'బుద్ధిమనంబులు మొద్దు బారి పోతు/ పాడెకు అందగాన్ని జేతుననె'** (పు.191). **వృద్ధాప్యపు వ్యక్తికి బాల్యపు స్మృతులు నాడు కష్టమే అయినా నేడు మధుర స్మృతులే** (పు.192, 193), **వృద్ధాప్యంలో బిడ్డల ఆసరా ముఖ్యం. వారు పంపే ధనం కాదని** (పు.141), **చివరి సంస్కారం జరుగుతుంటే నివారించలేని అ సంబద్ధాలను, ఆస్తి అంపకాల రోదను** కవి (పు.209.210) అక్షరీకరించారు. వృద్ధాప్య వాస్తవాలను, మరణంలో తాత్త్విక దృష్టిని కలిపి అందించారు కవి.

ఈ కవిలో హాస్య చమత్కారా భివ్య క్తులు మెండుగా ఉన్నాయి. వృద్ధాప్యంలో పని వారిపై ఆధారపడక తప్పదు.

కాదంటే 'కీలెంచి వాత పెట్టు' ఆమె 'కసుబుస్సులన్నీ దీవెనలె' తగ్గుట నీ మంచికేనని ఎరిగి మొగ్గలేయ మానిన మేలుబ మేలు' (పనిమనిషి) అంటూ పరిహాసంలో వాస్తవాన్ని జోడించి అందించారు.

పిల్లి, ఎలుకలు, కుక్కలు, కోడి, మేకలు, చీమ, బల్లి వంటివి మాస్కులు శానిటైజర్లు వాడలేదు. **'మనిషినే ఈ రెండు కాళ్ళ జంతువే! శానరోగాల బడుటేమి గ్రహింపుడు'** (పు.199) అంటూ పశు పక్ష్యాదులకు సోకని కరోనా రెండు కాళ్ల జంతువుకి సోకటాన్ని విస్మయంగా పేర్కొన్నారు. కరోనా భీతిని **'యుక్తిగా నీవొక్కడివై పోయి../ పాలనేత్రమున భస్మమొనరించుమయా'** (పు.137) అని శివుడిని వేడుకొన్నారు. మానవుడనే వింతు జీవి మాత్రమే కరోనాకు బలికావటమనే దుర్దశను హాస్యంలో భాగం చేసి ఆలోచిం పచేశారు.

కవికి రసవత్ హృదయం ఉండాలి. ఆ హృదయ స్పందనలు పఠితలను తన భావనతో మమేకం చేయగల అభివ్యక్తి గాఢత ఉండాలి. అప్పుడే అది అపూర్వ మనోజ్ఞంగా ఉంటుంది. అటువంటి నవ్యత గాఢత ఈ కవితల్లో ఉన్నాయి. మనిషిని మూఢాచారాల నుంచి బయటపడమని చెప్తూ కవి కొంగొత్త భావనను అందించారు. **'అంతగా మ్రొక్కాలనే తపనే నీకుంటే నీ ఇంటి పునాదులపై/ సాగి లపడు/ పది కాలాలు నీకు గొడుగు పడ తాయి'**(సంత వస్తువు). ఇది అపూర్వంగా, తత్పూర్వంగా ఎంగిలి కాని భావనగా నిలిచింది. కవిలోని సున్నితత్వాన్ని **'పువ్వుపై తేనె చిలికితే/ పువ్వు తన తనువును రుచి చూసుకుంటుంది/ తేనెకేం తెలుస్తుంది/ తమ తల్లి ఒడి చేరానని'** (అక్షయం) అనే వాక్యాలు చాటుతున్నాయి. కవిలోని భావుకత, సునిశితము, సుమధురం. **'శశాంకమందున్న శోభనీకిత్తును/ శశివై నీ మోము నవ్వు జూపు'** (పు.188) ప్రకృతిని ప్రేయసికి అందివ్వాలనే తపన కవిది.

శ్రీ టి.వి. స్వామిగారు ఆ తరపు విలువలను సంప్రదాయాలను మరువని వ్యక్తి. సమాజ హితాన్ని కాంక్షించేవారు. ఆధునికత సాంకేతికతలవైపు పరుగులు పతనానికి కాక పురోగతికి ఉండాలని కోరుకొనేవారు.

వాస్తవాన్ని గుర్తిస్తూ భ్రమలను చెరిపి వేస్తూ సాగమని చెప్పే బోధకుడు. భగవత్ భక్తి అది ఒనగూర్చిన తాత్త్వికత వారి సొంతం. పద్యంపట్ల ప్రీతి వచనంతో నడక వారి శైలి. సమాజం పట్ల ప్రేమ అనన్యం అందుకే ఎన్నో హితోర్తులు.

ఇన్ని భావాల అభివ్యక్తిని తన హృద యార్తితో ఆవిష్కరించిన శ్రీ టి.వి. స్వామి గారికి మనఃపూర్వక అభినందనలు.



-ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
సెల్:

## అక్షరవెలుగులు

అక్షరాలు వెలిగించాలని,
అనునిత్యము ఆరాటపడుతున్నా.
దీపాలు వెలిగించాలని,
తిమిరాన్నితోలాలని పోరాటంచేస్తున్నా.
కళ్ళనువెలిగించాలని,
కమ్మనిదృశ్యాలు కనబరస్తున్నా.
మోములు వెలిగించాలని,
చిరునవ్వులు చిందిస్తున్నా.
లోకమును వెలిగించాలని,
రవినై కిరణాలుచిమ్ముతున్నా.
రాత్రులను వెలిగించాలని,
శశినై వెన్నెలనుచల్లుతున్నా.
నక్షత్రపథము వెలిగించాలని,
తారకలను తళతళలాడిస్తున్నా.
కొవ్వొత్తులు వెలిగించాలని,
కటికచీకట్లను తరమలానియత్నిస్తున్నా.
జీవితాలు వెలిగించాలని,
సమాజానికి హితోపదేశాలుచేస్తున్నా.
మదులు వెలిగించాలని,
మధురకవితలను మంచిగాకూర్చుతున్నా.
బాణసంచా వెలిగిస్తున్నా,
మ్రోగిస్తున్నా లక్ష్మీప్రసన్నంకోసం.
కవితలను వెలిగిస్తున్నా,
చదివిస్తున్నా వాగ్దేవికటాక్షంకోసం.



-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్:7981616630

## అమ్మ...

నన్ను మోసింది నువ్వే
నా తొలి గుండె చప్పుడుకి చిరునామా నువ్వే..
నన్ను కన్నది నువ్వే
నాకోసం కలలు కన్నది నువ్వే...
నన్ను ఎత్తుకుంది నువ్వే
నీ గుండెలకు హత్తుకుంది నువ్వే...
నీ రొమ్ము పాలు ఇచ్చింది నువ్వే
నీ ప్రేమలోని మురిపాలు పంచింది నువ్వే...
నన్ను ఆడించింది నువ్వే
నన్ను ఆట పట్టించింది నువ్వే..
నన్ను పెంచింది నువ్వే
నీ రక్తం పంచింది నువ్వే...
నన్ను బడికి పంపింది నువ్వే
నాకు తెలిసిన తొలి గురువు నువ్వే...
నన్ను చదివించింది నువ్వే
నాకు జీవితాన్ని నేర్పించింది నువ్వే...
నాదైన గుణము నువ్వే
నాలోని ప్రాణం నీ నవ్వే ..
లవ్ యూ అమ్మా....



-బొమ్మకంటి మహేందర్
7032078727

# చంద్రవదన

(కథ)

"నమస్తే, నన్ను గుర్తుపట్టిన్రా" అన్నది ఒక సందమామ లెక్కున్నామె నవ్వుకుంట. గీ మాటలు కిషన్‌కు ఒక కార్యక్రమంలో ఇన్పిచ్చినయి. దగ్గర సుట్టాలయినోళ్ళ యింట్ల కార్యం ఉంటె గాడ్కి పొయ్యిండు కిషన్. "ఎవరబ్బ గీమె. గీమెను యాడ చూడలేదు. గాని ఎంతో ఖుషీతోని బాగ ఎర్కున్న మన్సి లెక్క నా దెగ్గిర్కి వొచ్చి పల్కరిచ్చింది" అని పరేషానై గామె ముకం దిక్కే సూడబట్టిండు. యాదికి వొస్తలేదు. ఎవరబ్బా గీ గుండ్రాటి మోకం. ఉంగ్రాల జుట్టు, ఎర్రబొట్టు. నవ్వుకుంట సూస్తున్న కండ్లు, నడివయస్సున్నా పడుచుపిల్ల లెక్కనే కన్పిస్తున్నది. గామె "ఏం బావా! పరేషానయితున్నవా? నేను ప్రభను. చంద్రప్రభను" అన్నది నవ్వు కుంట.

"ఓహో! యాదికొచ్చింది. బాగు న్నావా? ఎన్నేండ్లయింది నిన్ను సూసి" అన్నడు.

"బాగున్నవా బావా! నిన్ను సూడం గనే మల్ల గా ఎన్కటి దినాలు యాది కొచ్చినయి" అన్నది.

గామె ఎవరో కాదు. గాయ్నకు వరుసకు మరదలు కావాలె. గామె నాయ్న ఈయ్న నాయ్నకు బావమరిది అయితడు. గా రోజుల్ల కిషన్‌కు పెండ్లి కాలేదు. ఆమెకూ పెండ్లి కాలేదు. యింటి ముందు యిల్లే గాబట్టి సిన్నప్పట్సంది సూసిన మొకమేనాయె. కాని ముప్పయి ఏండ్ల కాలం గడ్సిపొయ్యింది. అయినగాని చంద్రప్రభలోని ప్రభ ఏమాత్రం తక్వ కాలే. కొంచెం వయస్సు మాత్రం కన్పిస్తున్నది. అదే నవ్వు, అదే నడక, అదే అందం. ఒక్క సారే కళ్ళ ముందు ప్రత్యక్షం అయ్యేసరికి అతను కలలు కన్న రాకుమారి తిరిగి వచ్చినట్లనిపిచ్చింది. ఎంటనే కిషన్‌కు ఈ గజల్ యాదికొచ్చింది. దీన్ని "ఫనా బులంద్ షహరీ" వ్రాస్తే. నుస్రత్ ఫతే అలీ చాలా శ్రావ్యంగా పాడిండు.

"మేరే రష్కే ఖమర్ తూనె పహ్‌లీ నజ్జర్

నజ్జర్ సే మిలాయీ మజ్తా
ఆగయా ॥మేరే॥
ఐసె లహరాకే తూ రూబరూ
ఆగయీ
ధడ్‌కనే బేతహాషా తడప్‌నే లగే
॥మేరే॥
తీర్ ఐసా లగా దర్ద్ ఐసా జగా
చోట్ దిల్‌పే జొ ఆయీ మజ్తా
ఆగయా
॥మేరే॥
జోష్ హీ జోష్ మేం మేరి ఆగోష్
మేం
ఆకె తూ సమాయీ మజ్తా
ఆగయా ॥మేరే॥
రేత్ హీ రేత్ థీ మేరే దిల్ మేం
భరీ ॥2॥
ప్యాస్ హీ ప్యాస్ థీ జిందగీ యే
మేరీ ॥2॥
బారిషేం గిర్కె ఆయీ మజ్తా
ఆగయా ॥మేరే॥
రాన్‌ఝూ హొగయే హమ్ ఫనా
హొగయే హమ్
ఐసే తూ ముస్కురాయీ మజ్తా
ఆగయా
॥మేరే॥

"చంద్రుడే ఈర్ష్యపడే ఓ నా అందమా! నీవు సుడిగాలిలా ఎదురొచ్చినావు. నిన్ను చూసి నా గుండె దడ దడలు ఎక్కువయినాయి. నీ చూపుల బాణం నా గుండెల్లో గుచ్చుకుంది. అయినా ఆ బాధలో ఆనందమే ఉంది. ఆతురతతో నీవు వొచ్చి నా ఒడిలో వాలినందుకు మైమరపు కలిగింది. ఈ నా హృదిలో అంతటా ఇసుకనే నిండి ఉండేది. నా జీవితంలో దాహమే దాహముండేది. కానీ నీ చూపుల జడివానతో హృదయమార్ద్రమై ఎంతో ఆనందం కలిగింది. నేను రాన్‌ఝూగా మారిపోయాను. నాశనమైపోయాను కాని నా బాధలు మరచిపొయ్యేలా నీవు ముసి ముసి నవ్వు నవ్వావు. ఓ నా చంద్రమా!"

గాయ్న పేరు కృష్ణగాని అందరు సిన్నప్పట్సంది కిషన్ అనే పిల్చేవారు. కిషన్ తండ్రి మ్యానమామ కొడ్కు ప్రభ తండ్రి. అంటే ఇద్దరు బావ బావమర్ద లన్నమాట. బావ బావమర్దులిద్దరు సిన్నప్పట్సంది దోస్తుల్లెక్క ఉండేటోళు ళ్ళ.

కిషన్‌కు ఒక అన్న, ఒక తమ్ముడు న్నరు. అన్న పెండ్లి అయ్యింది. ఇగ కిషన్ ఊళ్ళెనె పదిదాక సద్వి పట్నం పొయ్యిండు. పట్నంల డిగ్రీదాక సద్వీండు. పాస్‌కాంగానె సర్కారీ బళ్ళె పంతులు ఉద్యోగమొచ్చింది. కొలువు ండబట్టి పట్నంలనే ఉండబట్టిండు. అప్పుడప్పుడు ఊర్కి వొచ్చి పొయ్యే టోడు.

ఇగ చంద్రప్రభకు ఒక అక్కవు న్నది. గామెను కిషన్ అన్నకు ఇద్దామనుకున్నడు వాళ్ళ నాయ్న. కాని హైదరాబాదు నుండి లక్షాధికారుల సంబంధమొచ్చేసరికి బావకు చెప్పకుం డనే సంబంధం కుదుర్చుకున్నడు. కిషన్ తండ్రి ఏమనలేక మరొక్క సంబంధం తెచ్చి కొడ్కు పెండ్లి జేసిండు.

ప్రభ ఊళ్ళె ఉన్నప్పుడు కిషన్‌తోని పరాచికాలాడుకుంట ఇంటికి వస్తూ పోతూ ఉండేది. కిషన్ తల్లి తండ్రి గీమెనన్న చేసుకుంటే బాగుంటది అన్కునేటోళ్ళు. గా మాటలు కిషన్‌కు ప్రభకు కూడా తెల్సు.

గింతల్నే ప్రభ తండ్రి పక్క పట్నంల ఓ దుక్నం పెట్టిండు. కుటింబంతో ఉన్న ఊరొద్లి పొయ్యిండు. పక్క పట్నంల కూడ వాళ్ళకు పెద్ద యిల్లుండేది. తల్లిదండ్రుల ఎంబడే ప్రభ కూడ ఎల్లిపొయ్యింది. గా పట్నంలనే సద్వబట్టింది. కిషన్ ఊరికొచ్చినంక తెల్సింది ప్రభవాల్లతోనె పట్నంల ఉంటున్నది. ఎంటనే పక్క పట్నంలున్న వాళ్ళింటికి పొయ్యిండు. ప్రభతోని అత్తమామలతోని మాట్లాడిండు. తాను ఉద్యోగం చేస్తున్న సంగతి చెప్పిండు. త్వరలో లెక్చరర్ కాబోతున్న సంగతి కూడా చెప్పిండు. మల్ల కలుద్దామని చెప్పి తిర్గివొచ్చిండు.

కొన్ని రోజులు గడ్సినయి. ప్రభవాళ్ళ నాయ్న తమ సొంతూరికి వొచ్చిండు. బావతోని కల్సిండు. ఇద్దరు ముచ్చట్లు పెట్టుకున్నరు. మాటలల్లో ప్రభను కిషన్‌కిచ్చి పెండ్లి చెయ్యమన్నడు కిషన్ తండ్రి. గట్లనే గానియ్యి బావ. మన బంధం బలపడాలంటే గీ పనిచెయ్యాలె అన్నడు. ఇద్దరు కలసి భోంచేసిన్రు. తరువాత మాట్లాడుకుందం బావా అని చెప్పి తనున్న ఊర్కెల్లిపొయ్యిండు.

నెలలు గడ్సినై, యాడాదైపొయ్యింది. ప్రభ తండ్రి నుంచి ఏ సుద్దీ రాలేదు. వస్తదేమోనని ఎదురుసూసిండు కిషన్ తండ్రి. కాని అంత వొట్టిదే అయ్యింది. పెద్దామె అత్తగారి తరఫు బంధువుల్ల ఒక మంచి సంబంధ ముండింది. పిల్లగాడు సెల్‌టెక్స్ ఆఫీసుల కొలువు. మంచి జీతం ఇంక మీద్కెల్లి మస్తు ఆందనీ ఉన్నది. హైదరాబాదుల సొంత బంగ్లా ఉన్నది. ఒక్కడే కొడుకు. గీ సుద్దులన్నీ పెద్ద బిడ్డె తండ్రికి తల్లికీ చెప్పింది. ఇద్దరక్క సెల్లెండ్రం హైదరాబాదులనే ఉంటం. మన ప్రభకు తగిన సంబంధం. గా ఊరి సంబంధమెందుకు? గాయ్న ఏం పనిచెస్తడు. టీచరుద్యోగమాయె! ఏం ఆమ్‌దనీ ఉంటదని? తల్లితండ్రి చెవులల్ల బాగా నూరిపోసింది. వాళు ళ్ళ సై అన్నరు. ప్రభను మాటవరుసకైనా అడ్గలేదు. గామె బావమీద ఎన్నో కలలు పెట్టుకున్నది. బావనేమో హైదరాబాదు నుండి లెక్చరరై మరో ఊరికి పొయ్యిండు. గీ సంగతులేమి తెల్వలేదు. ప్రభకు కూడ బావ జాడ తెల్వదు. ఉత్తరం రాద్దామంటే పత్తా తెల్వదు. టెలిఫోను లేదాయే. ఏం చెయ్యాలో తెల్వక లోపల లోపల్నే ఏడ్సి ఏడ్సి కుమిలి పొయ్యింది. కాదనలేక పెండ్లి పిల్లయి కూసున్నది.

కిషన్ తండ్రికి పెళ్ళి పత్రికొచ్చింది. భార్యాభర్తలిద్దరు ఏడ్సుకున్నరు. తన బావమర్ది మాట యిచ్చి గింత మోసం చేసిండని బాధపడ్డరు. పెండ్లికి పోలే దు. "వానికి నాకు ఇక ఏం సంబంధం లేద"ని ఖరాఖండిగ చెప్పిండు. కిషన్‌కు ఉత్తరం రాసి మామ చేసిన మోసం చెప్పిండు. కిషన్‌కు గా ఉత్తరం సద్వంగనే గుండె పగిలినంత పనైంది. తండ్రికి "ఏం పర్వాలేదు. మరొక మంచి సంబంధం చూసి చేస్కుంట గాని, నీవ్వేమి ఫికరు చెయ్యకు" అని సముదాయిస్తూ ఉత్తరం రాసిండు.

కాలం గడ్సింది. తన మ్యానమామ బిడ్డెతోని పెండ్లయ్యింది. ఓ తరం గడ్సిపొయ్యింది. రిటయిరైనంక మల్ల హైదరాబాదుల్లనే మకాం బెట్టిండు.

దగ్గర సుట్టాల ఇంట్ల ఓ కార్యక్రమానికి హాజరయ్యిండు. అక్కడ ఎదురైంది "రష్కేఖమర్" తన కలల రాకుమారి. తన భర్తను కొడుకులిద్దర్ని పరిచెయం చేసింది. తన భర్తతో పరిచయం చేసి తన బావగారిదీ తమదీ ఒకటే ఊరనీ, ఎదురెదురు ఇళ్ళనీ చెప్పింది. ఆయ్న సహృద యుడు, మనసిప్పి మాట్లాడిండు. వీలయితే తమ యింటికి ఓసారి రమ్మని చెప్పిండు."

"ప్రయత్నిస్తాను" అన్నడు.

ప్రభవైపు సూసిండు. గామె కళ్ళలో ఏదో పోగొట్టుకున్నట్లు కనిపిచ్చింది. గింతల్నే వాళ్ళ కారొచ్చింది. అందరు కూసున్నరు. కూసున్నంక గామె కూసోని బావ దిక్కు సూస్తూ "పొయ్యొస్త బావా" అన్కుంట చెయ్యి ఊపింది.

కారు ముందుకు ఎల్లిపొయ్యింది.



-లక్ష్మణరావు పతంగే
92900 79047

## సావిత్రి బాయి పూలే!

సావిత్రి బాయి పూలే
చరిత్ర మరిచి పోలే
నిలిచేవు మా ఎదలో
కొలిచేము నిన్ను తల్లీ
స్వార్థంబు లేని సేవకు
చిరునామా వయ్యినావు
మనుషుల్లో తేడలొద్దని
ఆ మానవత యే ముద్దని
సతీ సహగమనం కు
సమాధి నీవు జేస్తివంట
వితంతువు ల తల్లి వయ్యి
అనాథల అమ్మవయ్యి
ఆకలి గొన్నో ల్లకమ్మ
కడుపులో మెతుకైతివంట
బడుల కు దూరమైన
బిడ్డల చేరదీసి నువ్వు
జ్ఞాన యుద్ధం జేస్తివో
సావిత్రి బాయి పూలే
చైతన్యం రగిలిస్తి వో
మా క్రాంతి బాయి పూలే
సమాజంలో వున్న
దురాచారముల నువ్వు
ఎండ గట్టినావు
క్రాంతి బాయి వయ్యి
మాకు మాట నేర్పినావు
సావిత్రి బాయి పూలే
చరిత్ర
మరువబోదు
మహారాష్ట్ర యందువున్న
నయగావు పల్లేయంటా
నీకు జన్మ యిచ్చేనంటా
జ్యోతిరావు పూలే తోటి
అడుగుల్లో అడుగులేసి
ఆ దీన జనుల సేవకో
సావిత్రీబాయి పూలే
నువ్వు బతుకు దారపోస్తివో
మా క్రాంతి బాయి పూలే
పేదల వాడలల్లో
బడులెన్నో నడిపినావు
అంటరాని వాడల్ల లో
అక్షరాల జ్యోతివయ్యి
బతుకు బాటను
చూపిస్తి వో
సావిత్రి బాయి పూలే
నువ్వు కలం బలం వయితివో
మా క్రాంతి బాయి పూలే
అవమానముల నెల్ల
ఎదురించి నడిచినావు
జ్ఞాన బోధ కోసం
నీ పయన మాగలేదు
చల్లిన బురుద తల్లీ
తన బాట కడ్డు కాదని
ఆ జ్ఞాన పరిమళాలు
వెదజల్ల కదిలి నావు
మా యింటి ముందర
మల్లేవో
సావిత్రి బాయి పూలే
మా వాక్కులమ్మ తల్లివో
మా క్రాంతి బాయి పూలే
ప్లేగు వ్యాధి తోటి
ఆ పూణే నగరమేమో
అరె తల్లడిల్లు తుంటే
చావుకు బెదరకుండా
రోగుల చెంత కెళ్ళి
గుండెల కద్దుకొని
నువ్వు సేవ చేసి తల్లీ
అండగా నిలిచినావు
అమ్మగా నిలిచినావు
ప్రజలే బిడ్డలంటివో
సావిత్రి బాయి పూలే
వాళ్ళ సేవలో కనుమూస్తి వో
మా క్రాంతి బాయి పూలే
నీ పాట విడువలేనిదో
సావిత్రి బాయి పూలే
నీ బాట మరువ లేనిదో!
మా క్రాంతి బాయి పూలే!



-పలస వెంకటేశ్వర్లు
9542315245

## ఆ వాసన ఆకలిది

ఆకలిగా వుందని అడిగితే
చేతుల్లో నిప్పులు పోశారు
కన్నీళ్లు కాలి అగ్నిపర్వతాలయ్యాక
పస్తులన్నీ ఒక్కసారిగా విస్ఫోటనం
లావానిండా పేగులు కాలిన వాసన...



-డా॥ కె.జి.వేణు
9848070084


సభలో ప్రసంగిస్తున్న బైస దేవదాసు.











## తెలంగాణ కళా జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# "ఇది మన భారతం-ఇది నా కళ" "జై జవాన్" అవార్డులు

మన కళలు సంస్కృతి సంప్రదాయాలను కాపాడతాయని రసమయి అధ్యక్షులు, బాలబంధు డా॥ఎం.కె.రాము అన్నారు. ఫిబ్రవరి 1న త్యాగరాయ గానసభలో తెలంగాణ కళా జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 77వ రిపబ్లిక్ డే సందర్భంగా 15 సం॥లలోపు చిన్నారులు 77 మంది కళాకారులకు "జై జవాన్" అవార్డు ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న యం.కె.రాము మాట్లాడుతూ.. సంగీత నృత్య కార్యక్రమాలు పిల్లలను సరికొత్త మార్గంలో నడిపిస్తాయని, వారి ఎదుగుదలలో ఎంతో మార్పు వస్తుందని వారి ప్రతిభ వెలుగు చూడడమే కాకుండా చదువులో కూడా బాగా రాణిస్తారని అన్నారు. 77వ రిపబ్లిక్‌డే సందర్భంగా 77 మంది చిన్నారి కళాకారులకు "జై జవాన్" అవార్డులు ప్రదానం చేయడం పట్ల తెలంగాణ కళా జాగృతి మాట్లాడుతూ... నృత్య ప్రదర్శన ఇవ్వడానికి మేకప్ వేసుకుని తమ సమయం కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్న ఈ చిన్నారుల్లో వున్న ఓపికను చూస్తే కళల పట్ల వారికున్న ఆసక్తి తెలుస్తోందని అన్నారు. ఐదేళ్ల చిన్నారులు వేదికపై వారి ప్రదర్శన ఎవరికైనా ఆశ్చర్యం కలుగకమానదని అన్నారు. వారి ఉత్సాహాన్ని చూస్తుంటే భవిష్యత్తులో గొప్ప కళాకారులుగా రాణిస్తారని అన్నారు.

ఆత్మీయ అతిథి, తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ మాట్లాడుతూ.. ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులను అభినందిస్తూ బడికి వెళ్ళే దశలో చిన్నారులు పడే ఇబ్బందులు, తల్లిదండ్రుల కష్టాలు పాట రూపంలో వినిపించి అందరిని అలరించారు.

ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులందరికి అతిథులు అవార్డు ప్రదానం చేశారు. తదనంతరం నృత్య గురువులు **శ్రీమతి రమాదేవి,**


సభలో ప్రసంగిస్తున్న సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకటరెడ్డి. వేదికపై పద్మ వెంకటేశ్, బైస దేవదాసు, డా॥ యం.కె.రాము, వంగివరపు రవికుమార్, పల్లె నర్సింహ తదితరులు

ఫౌండేషన్ అధ్యక్షులు పద్మ వెంకటేశ్‌ను అభినందించారు.


ప్రత్యేక ఆహ్వానితులు సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ... పిల్లలలో వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం చాలా అవసరమని జీవితంలో తప్పటడుగులు వేయకుండా క్రమ పద్ధతిలో ఎదగడానికి అవకాశం వుంటుందని అన్నారు. కళల ద్వారా సంస్కారం అలవడుతుందని తద్వార సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని అన్నారు. సభాధ్యక్షులు నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ... ప్రపంచమంతా మన కళలపట్ల ఎంతో మక్కువ చూపడం గొప్ప విషయమని మన కళలు సంప్రదాయాలు పిల్లలో ఆసక్తి కలిగిస్తున్నాయని అందుకు నిదర్శనమే ఈ రోజు పాల్గొన్న ఈ చిన్నారులే నిదర్శనమని అన్నారు.

చిన్నారులకు భాష తెలియదు భావం అసలే తెలియదు అయినా శబ్దానికి వారి నృత్యాలు అందరిని అలరిస్తున్నాయని అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. చిన్నారుల్లొ ప్రతిభను మెరుగు పరుస్తున్న నృత్య గురువులను అభినందించారు.గౌరవ అతిథి వంగివరపు రవికుమార్ **శ్రీమతి, గంగా భవానీ, కుమారి బిందుశ్రీ బత్తిన, శ్రీమతి వాసంతి శర్మ, శ్రీమతి ఫణి జ్యోతి, శ్రీమతి భార్గవి సత్యం, కుమారి జి. నాగ లక్ష్మి సాహితి, శ్రీమనోజ్, శ్రీజగిని హరీష్, ఎ. భావన, శ్రీమతి మౌనిక మహాలక్ష్మి, శ్రీమతి చిత్ర, కుమారి నిహారిక, శ్రీసాయి చరణ్, పూర్ణిమ, శ్రీమతి వనిత ఎడ్ల, శ్రీమతి పత్తిపాక రేవతి, శ్రీ రమణాచారి**లను సత్కరించారు.

సంస్థ అధ్యక్షులు పద్మా వెంకటేశ్ మాట్లాడుతు సచ్చిదానంద కళాపీఠం అధ్యక్షులు కీ॥శే॥ రత్నాకర శర్మ ఆశీస్సులతో కళా సంస్థల సంయుక్త నిర్వహణలో "సంప్రదాయ తరంగిణి" సరికొత్తగా "ఇది మన భారతం-ఇది నా కళ" "జై జవాన్" అవార్డులు బహూకరించడం జరిగిందని ఉత్తమ గురువుల శిక్షణలో అభ్యసించిన కళాకారులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని కళాకారులకు ఆశిస్సులు అందజేసిన అతిథులకు, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.

త్యాగరాయ గానసభ ప్రధాన హాలు నృత్య కళాకారులు, వారి తల్లిదండ్రులతో కళకళలాడింది.


డా॥యం.కె.రామును సత్కరిస్తున్న అతిథులు











**కళాకారులతో అతిథులు**





మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1689వ రోజు **'ఆడపిల్ల ఎదగాయాలు- నయం చేసేది పుట్టినిల్లా? మెట్టినిల్లా?'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'ఆడపిల్ల ఎదగాయాలు-నయం చేసేది పుట్టినిల్లా? మెట్టినిల్లా?' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

**-సంపాదకులు**



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** *9441046839*

## నమ్మకంతో

ఆడపిల్ల ఎదలో
నిశ్శబ్దంగా నిలిచిన మౌనం
కళ్ల వెనుక దాచిన వాన
హృదయపు గోడలపై
గీతలు వేసిన జ్ఞాపకాలు.
పుట్టినిల్లు..
అనురాగపు తలుపులు తెరిచే చోటు
అమ్మ ఒడిలో కరిగే కాలపు సుగంధం
నాన్న నడకలో భరోసా అడుగులు
తోబుట్టువుల నవ్వుల్లో
గాయం కూడా
ఆటలాగే మారే క్షణాలు...
అక్కడా..
ఆమె కన్నీళ్లు
పేరుపెట్టి పిలవబడతాయి..
వేదనను ఓదార్చే
చెలిమి దొరుకుతుంది..
గుండె చిట్లినా
మళ్లీ కుట్టే సూది దొరుకుతుంది...
మెట్టినిల్లు..
బాధ్యతల మలుపుల రహదారి..
పరిమితుల నీడలో నిలిచిన ఆశతో
పాత్రల మధ్య
తన పేరుని వెతుక్కునే ప్రయత్నం
నవ్వు ఒక అలవాటు
మౌనం ఒక ఒప్పందం
ఇక్కడా..
గాయం గౌరవంగా దాచాలి..
కన్నీళ్లు అర్ధరాత్రి వరకే తోడు
ఎందుకంటే
తనకంటే ముందుగా
ఇంట్లోవారి శ్వాసను వినాలి
అయితే?
నయం చేసేది ఎవరు?
పుట్టినింటి మృదుత్వమా?
మెట్టినింటి బాధ్యతలా?
ఒకటి మాత్రం నిజం
గాయం నయమయ్యేది
ఆమె తల ఎత్తి నిలిచిన క్షణాన
తన మాటకు తానే సాక్ష్యమై
తన హృదయాన్ని
తానే కాపాడుకున్నప్పుడు
పుట్టినిల్లు ఆమెకు గుర్తు చేస్తుంది
ఆమె ఎవరని
మెట్టినిల్లు ఆమెకు నేర్పుతుంది
ఆమె ఎంత బలమో
బలహీనమో కూడా చెప్పుతుంది
కానీ..
ఆడపిల్ల ఎద గాయం?
నయం చేసేది చోటు కాదు
ఆమెలో పుట్టిన వెలుగు మాత్రమే..
కొన్నిసార్లు..
ఆడపిల్ల ఎదలో
గాయం కావడానికి ముందే
ఒక ముడి పడుతుంది
ఎవరూ గమనించని చోట..
అద్దం కూడా అడగని ప్రశ్నలా
అది మాట కాకపోయిన ఒక ఆలోచన
అలవాటుగా మింగేసిన ఆశ
నవ్వులో దాచిన ఒంటరితనాన్ని
ఆమె నేర్చుకుంటుంది
నడవడం మాత్రమే కాదు
నడుస్తూనే భరించడం.
చుట్టూ ఉన్న ప్రపంచం
ఆమెకు కొలతలు వేస్తుంది..
ఇంతవరకేనని
ఇలానే ఉండాలని
ఇలాగే మాట్లాడాలని
ఆ కొలతల్లో ఇరుక్కొని
ఆమె తనను తానే
చిన్నదిగా మడుచుకుంటుంది..
అక్కడే పడుతుంది
ఆ ముడి..
కాలం నడుస్తుంది?
బాధ్యతలు పేర్లు మార్చుకుంటాయి..
ముఖాలు మారుతాయి..
కానీ ఆ ముడి
మాత్రం మౌనంగా
ఆమెతోనే ప్రయాణం చేస్తుంది..
ఒక రోజు
ఎవరూ లేని క్షణంలో
ఆమె తనను తానే చూసుకుంటుంది
తప్పుల జాబితా కాదు..
బలాల గణన మొదలవుతుంది..
అప్పుడే ఆ ముడి సడలుతుంది
కన్నీళ్లతో కాదు..
నమ్మకంతో..
ఆడపిల్ల ఎద గాయం
బయట ప్రపంచం వల్ల కాదు
బయట ప్రపంచానికి
తనను తగ్గించుకున్నప్పుడు
నయం అయ్యేది కూడా
ఎవరి చేతుల్లోనో కాదు..
"నేను సరిపోతాను"అని
ఆమె తనకు తానే చెప్పుకున్నప్పుడు..

**-శ్రీలతరమేశ్ గోస్కుల**

## తలరాత

ముందు కాలంలో
ముచ్చటైన కళ్యాణాలు
పెద్దల దాపు దన్ను
బిడ్డలకు ఆలంబన.
నేడు
అత్యధిక చదువులు
హద్దులు లేని స్వేచ్ఛలు
అహంతో
మితిమీరిన తెగింపుతో
ఆలోచనను పక్కనబెట్టే పదతులు.
కొత్త బాధలు తెచ్చి పెట్టే పట్టుదల
జీవిత పరమార్థం కాదు
పట్టువిడుపుల కాలం కావాలి
బిడ్డల భవిష్యత్తుపై కావాలి ఆలోచన.
ఆవేశం పక్కన పెట్టి
బిడ్డల భవిత కోసం
వారి బంగారు భవిష్యత్తు కోసం
సంసారపు పురోగతి
చాలా ముఖ్యమని ఆలోచించి
చక్కని చల్లని భవిష్యత్తు దిశగా
అడుగులు వేయాలి
పుట్టింటి సహకారంతో
మెట్టింటి అండదండలతో
తలరాత దిద్దుకోవాలి.

**-కె.కె.తాయారు**

## ఏదీగాదు!

ఎదగాయానికి
ఆడా మగా తేడా ఎక్కడ?
ఎవడి ఎద ఏడిస్తే
వాడే ఓర్చుకుని
పైకి లేవకపోతే
అణగదొక్కే కాలం
గాయానికి మందు
ఓచల్లనిమాట
ఓదార్పు, నిమిరే హస్తం!.
దానికి ఇల్లు విల్లు విల్లా
అనే పేరేల!?
కన్నీరు తుడిచి
భుజం తట్టే పరాయివారు
ఉన్నారక్కడక్కడ.
పురాణాలు కావ్యాల్లో
ఆడపిల్లలకి సహనం
ఓర్పుయే ఓదార్పు
అత్తింట కాలుపెట్టిన అతివ
పన్నెత్తి కన్నెత్తి చూడక
లోలోన కుమిలిందని ఎరుగవా?
ఊర్మిళ దీర్ఘనిద్రలో
అహల్య రాయిగా
యశోధర పచ్చిబాలింతని
ఓదార్చినవారేరీ?.
మధ్య యుగంలో
పరదాలమాటున మగ్గి
పుట్టింట అత్తింట కుమిలిన
మొగ్గలను కనలేదా?
జోహారు పేరుతో సతీసహగమనం
ముక్కుపచ్చలారని పసిది
ముసలాడికి ఆలియై
నెత్తిన ముసుగు చెరిగిన బొట్టుతో
పుట్టినింట అడ్డచాకిరీతో
అత్యాచారాలకి బలికాలేదా?.
చదువుపేరుతో
ప్రేమ ఊబిలో చిక్కుకున్న
ఆడ, మగ పిల్లల్లో
ఎదగాయం సమానం
అమ్మ నాన్నలున్నంతకాలం
తాత్కాలిక పైపూతలు ఆయింట్ మెంట్స్
ఒంటికాయ సొంఠికొమ్ము కి
"నీఖర్మ నీవే అనుభవించు"
అనే దెప్పుళ్లు
వేధింపులసాధింపులు.
ఆర్థికంగా స్థిరపడ్డ ఆడపిల్ల కి
ఆత్మ విశ్వాసం ధైర్యం చేయూత
అవసరం
అన్నదమ్ముల అక్కచెల్లెళ్ల
ప్రేమాప్యాయతలు కావాలి.

**-ఎ.రాజ్యశ్రీ**

## పుట్టింటి నేల మట్టి

మెట్టింట అడుగిడినా
వెంటాడుతూనే ఉండే
పుట్టింటి మట్టివాసన!!.
మూడు ముళ్ళు ఏడడుగులు
కొత్త బంధాలు ఏర్పడినా
బుజ్జాయి మెట్టినింటిలో నడయాడినా
పుట్టింటి నేలమట్టి
అనుక్షణం వెంటాడుతూనే ఉంటుంది!!.
కన్నపేగు తెంచుకున్నప్పటినుండి
కంటికి రెప్పలా కాపాడిన తల్లిదండ్రులు!!.
తనతో పుట్టి పెరిగిన తోబుట్టువులతో
ఆడుకున్న మధుర బాల్య స్మృతులు!!.
వారి తీయని జ్ఞాపకాలు
మదిలో పది కాలాలు
పచ్చగానే ఉంటాయి!!.
పుట్టినప్పుడే "ఆడ" పిల్ల అని
ఈడ పిల్ల కాదు అని గుర్తు చేస్తూ
గుడ్లనీరు కుక్కుకుని
ఒక అయ్య చేతిలో పెట్టే అమ్మానాన్నలు!!.
మెట్టినింటికి వచ్చినా
కడ వరకూ ఆ జ్ఞాపకాలు
వెంటాడుతూనే ఉంటాయి!!.
అన్నాచెల్లెళ్ళ బంధానికి
నిలువెత్తు సంతకం శ్రావణపూర్ణిమ
వారి జీవితాలలో
రాఖీ పండుగ ఒక మెరుపు!!.
ఎదగాయం నయం చేసేది
పుట్టినిల్లే మరి!!
వీడని వాడని పుట్టింటి
మట్టి వాసనలు
వెంటాడే భవబంధాలు!!.

**-పరిమి వెంకట సత్యమూర్తి**

## వ్యత్యాసాల నడుమ

వ్యత్యాసాల నడుమ
ఆడపిల్లైనా మగబిడ్డైనా
ఎద గాయం గాయమే.
ప్రియమైతే కష్టాన్నికూడా
సుఖంగా చూస్తాడు,
అప్రియమైతే
సుఖం కూడా కష్టమే
ఎద గాయానికి కారణం
పుట్టినిల్లు- మెట్టినిల్లు అనే వ్యత్యాసం
తనది, పరాయి వారనే భావం
గాయం నయం కావటం సుదూరం.
గాయంపై క్షమ విస్మరణలనే లేపనం
నవ్వుల పువ్వుల
చేరువు తరువులు కలిగుంటే
పుట్టిల్లైనా మెట్టినిల్లైనా
గాయం నయం బహు సులభం.

**-రాజప్ప**

## గాయాలు ఎలా?

పెళ్లి అయ్యేవరకు పుట్టింట
బంగారు తల్లి ఆడపిల్ల!
అమ్మానాన్నలకు అన్నిటా చేదోడుగా
ఏ కష్టమైనా కాపాడుతూ ఉండే
ఆడపిల్ల ఏనాడైనా అక్కడి పిల్లగా!
అని కన్నీళ్లు దాచుకు అప్పగిస్తారు!
అపరిచిత వ్యక్తుల మధ్య ఆ ఇంట
అలవాటు పడి అందరికీ తలలో నాలుకై
సేవలు చేస్తున్నా అత్తమామలు కొందరు
సాధింపులు మానరు!
సహనంతో సరిపుచ్చుకుని
సర్దుకుపోయే ఇల్లాలికి
ఎలా అవుతుంది ఎద గాయం!
మదిలో ముదం నింపుకొని
మసలే ఆడపిల్లకు ఎప్పుడూ
ఆడయినా, ఈడైనా సుఖాలే!
మనసు మలుచుకుంటే చాలు!
పుట్టిల్లయినా, మెట్టిల్లయినా
స్వర్గధామాలే ఆడపిల్లకు!
గోరంతను కొండంతలు చేసి
పుట్టింటికి పారిపోయే ఆడ పిల్లలకు
నీకన్నా నా సంపాదన ఎక్కువని
భర్తకు విలువివ్వని
ఇల్లాళ్ల జీవితం దుర్భరం.

**-కోలా సత్యనారాయణ**

## పుట్టిల్లే ఆడపిల్లకు రక్ష

కాకూడదెన్నడూ ఆడపిల్లకు ఎదగాయం
అయ్యిందంటే అది సిరులు కరిగే సంకేతం
పుట్టినింట కూతురిది యువరాణి వైభోగం
లేదు ఎదకు గాయమయ్యే అవకాశం
ఆడపిల్ల ఎదకయ్యిందంటే గాయం
అధిక శాతం మెట్టినిల్లే కారణభూతం.
భర్తలతో ఎదురయ్యే భవసాగరాలు
ఆడబిడ్డ, అత్తమామల ఎత్తిపొడుపులు
అదనపు కట్నం కోసం వేధింపులు
ఆడపిల్లల ఎదగాయాలకు కారణాలు.
పుట్టింట గారాబంగా పెరిగిన ఆడపిల్లలు
తాళలేక అత్తింటి వేధింపులు, సాధింపులు
క్రుంగి కృశించడమే ఎదకైన
మాయని గాయాలు
నయం కావాలంటే ఆడపిల్ల ఎదగాయాలు
పుట్టిల్లే చూపాలి నిఖార్సైన పరిష్కారాలు
అర్థం చేసుకొని కన్నకూతురి బాధలు
అక్కున చేర్చుకుని అమ్మానాన్నలు
ముందుగా రంగరించి మంచి మాటలు
మాన్పాలి కూతురి ఎద గాయాలు
పుట్టిల్లే సదా కూతురికి రక్షణ కవచం.

**-జె.వి.కుమార్ చేపూరి**

## ఒకప్పటి స్వర్గాల నిలయం

విత్తు ముందా? చెట్టు ముందా?
మనిషికి రెండు కళ్ళు అవసరమే
దేన్నీ తక్కువ చూడలేం
కుడి ఎడమ మాత్రమే తేడా.
అమ్మను మరిచి ఉండలేం
అత్తను మామను కాదనలేం
వేళ్ళు భూమిలోనే ఉంటాయి
కొమ్మలు ఆకులు పైకి కనిపిస్తాయి.
తల్లి తండ్రి ప్రేమలు పుట్టినినీటి జ్ఞాపికలు
మెట్టినినీటి బాధ్యతలు తరగని ఆస్తులు
మెట్టినినీట్లో మెచ్చుకోలు తాత్కాలిక వరాలు
పుట్టినినీటి జ్ఞాపకాలు మధుర స్వప్నాలు.
కొమ్మవు నీవే చెట్టువు నీవే
కాయలు కాసేది పూలు పూసేది నీకే
కాయలున్న కొమ్మలకే రాళ్ళ దెబ్బలు
కళ్ళనీళ్ళు కనబడకుండా ఏడ్వడమే నీ గొప్పలు.
మూలాలు లేకుండా ఏ చెట్టుకు పేరునీడదు
పిల్ల కాలువలు లేకుండా ఏ నదీ ప్రవహించదు
చీకటి లేకుండా వెలుగుకు గుర్తింపు రాదు
ఆడది లేకుండా ఏ యింటిలో దీపనీ వెలగదు
మెట్టినిల్లు ఇష్టంగా మార్చాల్సిన
బంధాల వలయం
పుట్టినిల్లు ఒకప్పటి స్వర్గాల నిలయం.

**-కందుకూరి మనోహర్**

# చార్లెస్ డార్విన్ - జీవ పరిణామ సిద్ధాంత రూపశిల్పి

ప్రపంచ మానవాళిని ప్రభావితం చేసిన అతి కొద్ది మంది మేటి శాస్త్రవేత్తల్లో చార్లెస్ రాబర్ట్ డార్విన్ ప్రముఖుడిగా గుర్తింపబడుతున్నాడు. ఇంగ్లాండ్‌లో 12 ఫిబ్రవరి 1809న ఒక సంపన్న కుటుంబంలో జన్మించి చార్లెస్ డార్విన్ అత్యంత ప్రధానమైన సహజ ప్రాణి ప్రపంచానికి చెందిన "జీవ పరిణామ సిద్ధాంతాన్ని (థియరీ ఆఫ్ ఎవోల్యూషన్)" ప్రతిపాదించి జీవ శాస్త్రవేత్తగా చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. వైద్యుడైన తండ్రి చార్లెస్ డార్విన్‌ను ఎడిన్బర్గ్ యూనివర్శిటీలో చేర్పించి వైద్య శాస్త్రంలో ప్రవేశించాలని ఆశించినప్పటికీ ప్రకృతి ఒడిలో ఉన్న వైవిధ్యభరిత జీవ కోటి మనుగడకు సంబంధించిన అంశాల పట్ల ఆకర్షితుడై మెడిసిన్ కోర్సును వదిలి జీవుల సహజ జీవ పరిణామం పట్ల జీవ శాస్త్ర అధ్యయనం ప్రారంభించారు. 1831లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ పట్టా పొందిన చార్లెస్ డార్విన్‌ఐదేళ్ల పాటు భౌగోళిక నౌకాయాన బృందంలో నాచురలిస్ట్‌గా పాల్గొనడంతో జీవ వైవిధ్య సౌందర్యాలను ప్రత్యక్షంగా చూడడంలో తన జీవ పరిణామశాస్త్ర అధ్యయనాలు, ప్రతిపాదనలకు మూలస్తంభాలుగా నిలిచాయి.

**చార్లెస్ డార్విన్ ప్రధాన శాస్త్ర ప్రతిపాదనలు:**

జీవ పరిణామ సిద్ధాంతానికి సంబంధించిన నేచురల్ సెలక్షన్ ఆధారంగా "ఆన్ దిఓరిజిన్ ఆఫ్ స్పీసీస్" అనే పరిశోధన పుస్తకాన్ని 1859లో ముద్రించి నాటి జీవశాస్త్ర సాంప్రదాయ ఆలోచనలకు విరుద్ధంగా తన అధ్యయనాల ఫలితాలను బయటి ప్రపంచానికి వివరించి విశ్వ శాస్త్ర వేత్తల దృష్టిని ఆకర్షించగలిగారు. 1871లో లింగ ఎంపిక సిద్ధాంతం (సెక్సువల్ సెలక్షన్ థియరీ)తో మానవ పరిణామానికి సంబంధించిన "ది డిసెంట్ ఆఫ్ మ్యాన్(మానవ సంతతి)" పుస్తకం ముద్రించారు. వీటికి తోడుగా వానపాముల "ఎర్త్ వర్మ్ స్టోన్" అనే పరిశోధనలు, ఫోటోట్రోపిజమ్ పరికరం, పీజియన్ ఫెన్సింగ్, బొటానికల్ పరిశోధనలు, కోరల్ రీఫ్ ఏర్పాటు, కంపారిటివ్ అనాటమీ (తులనాత్మక శరీర నిర్మాణ శాస్త్రం) లాంటి పలు అతి ముఖ్యమైన అంశాల ప్రతిపాదనలు చేశారు.

జీవశాస్త్ర రంగంలో చిరస్థాయిగా నిలిచిన చార్లెస్ డార్విన్ తన 73వ ఏట 19 ఏప్రిల్ 1882న తుది శ్వాస విడిచారు. సహజ శాస్త్రం ఆధారంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన "ఆన్ ది ఒరిజిన్ ఆఫ్ స్పీసీస్" పరిశోధన పుస్తకంతో ప్రపంచ ప్రశంసలు పొంది "జీవ పరిణామ పితామహుడు" అనే బిరుదును పొం దారు. విన యం, ఓపెన్ మైండెడ్, ఇంట్రెవర్టెడ్, దయాగుణాల మేలుకలయిక అయిన చార్లెస్ డార్విన్ జీవితం నేటి పరిశోధ కులకు, యువతకు దారి దీపం కావాలని కోరుకుందాం, మనం కూడా పరిణామం చెంది అద్భుత పరిశోధనలకు ఆజ్యం పోద్దాం.

(12 ఫిబ్రవరి "చార్లెస్ డార్విన్ జయంతి" సందర్భంగా)



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037




## రామకృష్ణ చంద్రమౌళి కవిత్వం వెన్నెల్లో రసగుళిక లాంటిది

# రామకృష్ణ చంద్రమౌళి కవిత్వం



సభలో ప్రసంగిస్తున్న డా॥నామోజు బాలాచారి, డా॥ నాళేశ్వరం శంకరం, బైస దేవదాసు, కె.ఆనందాచారి | రామకృష్ణ చంద్రమౌళిని సత్కరిస్తున్న అతిథులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నేటినిజం ప్రతినిధి): వెన్నెల్లో రసగుళిక లాంటిది అని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ఎన్.బాలాచారి అన్నారు. చిన్న వయసులోనే పెన్ను పట్టి ఐదు వేలకు పైగా కవితలతో అక్షర సేద్యం చేస్తూ సుదీర్ఘ కాలంగా సాహితీ సేవకు అంకితమైన కవి రామకృష్ణ చంద్ర మౌళి అని పేర్కొన్నారు.

తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డా॥నాళేశ్వరం శంకరం అధ్యక్షతన సాహిత్య వారం కార్యక్రమం ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్.బాలాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రామకృష్ణ చంద్రమౌళి కవిత్వం మానవ విలువలకు ప్రాధాన్యత ఇస్తూ సమాజ హితం కోరే వని అభివర్ణించారు. నేటి నిజం సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ.. అలతి అలతి పదాలతో పాఠకులను అలరింపజేసే అరుదైన కవి రామకృష్ణ చంద్రమౌళి అన్నారు.

సున్నితంగా కనిపించే వీరి కవితలు సమాజంలో జరిగే అన్యాయాలను ఎండగడతాయని అన్నారు. అనం తరం నాళేశ్వర శంకరం మాట్లాడుతూ....వినూత్న మైన గట్టి కవితా వస్తువుతో రామకృష్ణ చంద్రమౌళి రాసిన కవితలు చిన్నా పెద్దా అందరినీ వెన్నెల వర్షంలో విహరింపచేస్తాయని కొని యాడారు.

పుస్తక రచయిత రామకృష్ణ చంద్రమౌళి తన స్పందన తెలియ చేస్తూ కార్యక్రమ సమన్వయ కర్త పి.బడేసాబ్ తో సహా పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సి.ఎన్.రావు, తిరుమల రావు, ఒద్దిరాజు ప్రవీణ్, జె.వి.కుమార్, గిరిజ సంగీత, సత్యవీణ, రాధ, రమణి, విమల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లు

యాదాద్రి, ఫిబ్రవరి 11: మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి మండలం లోని దివ్య బాల విద్యాలయంలో భువనగిరి, చౌటుప్పల్ ,పోచంపల్లి, యాదగిరిగుట్ట, ఆలేరు, మోత్కూర్ మున్సిపాలిటీలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లు, టేబుళ్ల అమరిక, సిబ్బంది నియామకాలు వంటి అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం కచ్చితంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి టేబుల్ వద్ద అంజర్వర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అభ్యర్థులు, ఏజెంట్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, కూర్చునే సౌకర్యం, ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పించాలని తెలిపారు.



స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడు అంచల భద్రత కల్పించాలని, అనుమతి ఉన్నవారికి మాత్రమే ప్రవేశం ఇవ్వాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేసి ఫలితాలను సమయానికి ప్రకటించాలని జిల్లా కలెక్టర్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫిబ్రవరి 21,22 తేదీలలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో జరగబోతున్న దశాబ్ది ఉత్సవాల పోస్టర్ని నిజామాబాద్‌లో ఆవిష్కరిస్తున్న ప్రముఖ విద్యావేత్త అమృతలత, రచయిత్రి నెల్లుట్ల రమాదేవి, కె.ఆనందాచారి తదితరులు

# మధ్యతరగతి మనస్తత్వాలకు అద్దం పట్టే కథలు

-ప్రభుత్వ పూర్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారి



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నేటినిజం ప్రతినిధి): కథాసాహిత్యంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సింగిల్ పేజీ కథలకు ఆదరణ పెరుగుతోందని, 'వంశీ కథలు-2025' కథాసంకలనంలోని కథలన్నీ మధ్యతరగతి మనస్తత్వానికి అద్దం పట్టే కథలని తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచారి అన్నారు. జనవరి 28న డా॥కె.వి.రమణాచారి క్యాంపు ఆఫీసులో సాహితీకిరణం ఆధ్వర్యంలో వంశీ 32వ ప్రచురణ **'వంశీకథలు- 2025'** కథాసంకలనం పరిచయ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన పొత్తూరి సుబ్బారావు వంశీ సాహితీకిరణం ద్వారా నిర్వహించిన సింగిల్ పేజీ కథల పోటీకి మనదేశంనుండే కాక విదేశాలనుండి కూడా ఎన్నో కథలు వచ్చాయని, వాటన్నిటినీ దివంగత తెన్నేటి సుధాదేవిగారు రాత్రింబళ్ళు కష్టపడి కథలన్నిటినీ చదివి స్ఫూర్తి నిచ్చే కథలను ఎంపిక చేశారని వారిని ప్రశంసించారు. ప్రముఖ సాహితీవేత్త సుధామ పుస్తకంలోని కథలన్నిటినీ చక్కగా విశ్లేషించారు. డా॥వంశీ రామరాజు సభను ప్రారంభించగా, పెద్దూరి వెంకటదాసు కొన్ని కథలను విశ్లేషించారు.

పొత్తూరి జయలక్ష్మి నిర్వహించిన ఈ సభలో కథలపోటీ విజేతలైన వేము వందనం, ప్రభు, టి.శ్యామకృష్ణ, తులసి బాలకృష్ణ, కొసరాజు ఫౌండేషన్ విజేతలైన జొన్నలగడ్డ శ్యామల బహుమతులు స్వీకరించారు. శ్రీధరశర్మ, అరుణకుమారి, ఎన్వీ.శ్రీధర్ శర్మ పుస్తకాలు స్వీకరించారు. పొత్తూరి జయలక్ష్మి వందన సమర్పణ చేశారు.

# గుంటూరు జిల్లా రచయితల సంఘం సాహితీ పురస్కారాలు - 2026

గుంటూరు జిల్లా రచయితల సంఘం సాహితీ పురస్కారాల కోసం కథ, కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కవులు, కథకులు 2025 లో వెలువడిన తమ కథ, కవితా సంపుటాలు మూడు ప్రతులను **మార్చ్ 31, 2026** లోపు కింది చిరునామాకు పంపగలరు. ఎంపికైన కథ, కవితా సంపుటాలకు గుంటూరులో జరుపు సభలో రూ. 5000/- నగదు బహుమతితోపాటు రచయితలకు సత్కారం వుంటుంది.

పుస్తకాలు పంపవలసిన చిరునామా:నానా, ఇంటి నెంబర్: 63-5-596,, ఎన్.ఎన్.ఆర్ నిలయం, బాలాజీనగర్ 3/4, పాత గుంటూరు, గుంటూరు-522001 సెల్: 9849139337


- సి. భవానీదేవి-అధ్యక్షులు
- ఎస్.ఎం సుభాని- ప్రధాన కార్యదర్శి

# అంతర్జాతీయ స్థాయిలో తెలుగు వారి ఖ్యాతినిలిపిన బళ్లారి రాఘవకి



వేదికపై ప్రసంగిస్తున్న సిరికొండ మధుసూదనాచారి. వేదికపై కొల్లి నాగేశ్వర రావు, జయసూర్య, కళా జనార్ధనమూర్తి దర్శ క నిర్మాత మల్లం రమేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నేటినిజం ప్రతినిధి):బళ్లారి రాఘ వగా పేరు పొందిన తాడిపత్రి రాఘవాచార్యులు నాటక రంగా నికే జీవితాన్ని అర్పించిన మహా నటుడు అని శాసన మండలి లో ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలుగు జాతి కీర్తిని ఆయన అం తర్జాతీయ స్థాయిలో నిలిపిన గొప్ప కళాకారులు అని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని లలిత కళా వేదికపై భాషా సాం స్కృతిక శాఖ సౌజన్యంతో గాన సభని ర్వాహణలో జరుగు తున్న ఎందరో మహానుభావులు కార్య క్రమ పరంపరలో భాగంగా విఖ్యాత రంగస్థల నటుడు బళ్లారి రాఘవ యాదిలో పేరిట సంస్మ రణ సమావేశం జరిగింది ము ఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూద నాచారి మాట్లాడుతూ తెలుగు కన్నడ సంస్కృత ఆంగ్ల భాషలో పండితుడు రాఘవ న్యాయ శాస్త్రం లో పట్టా పొందినా నాటక రంగా నికి అంకితం అయ్యారు అని తెలి పారు. ఆయన తెలుగు పౌరాణిక నాటకాల్లో ప్రధాన పాత్రలు పోషిం చారు. అలాగే షేక్స్పియర్ ఆంగ్ల నాటకాలు ప్రదర్శిస్తూ దేశం దాటి లండన్‌లో కూడా ప్రదర్శనలు ఇచ్చే సమయంలో విఖ్యాత ఆంగ్ల రచయిత జార్జ్ బెర్నార్డ్ షా రాఘవ నటకు ముగ్ధుడై ఆయన తో కళల పై చర్చి ంచారని వివరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనా ర్ధనమూర్తి మాట్లాడుతూ మహనీయుల సంస్మరణకి జయ ంతి వర్ధంతి తేదీలతో నిమిత్తం ఉండదు అని వివరిం చారు వారు నిత్య స్మరణీ యులు అన్నారు. వేదికపై జర్నలిస్ట్ జయ సూర్య వికలాంగులం సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర రావు వందే భార త్ సినిమా దర్శ క నిర్మాత మల్లం రమేష్ పాల్గొన్నారు





సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

# 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్:రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



## ఆత్మ న్యూనత..!

కానీకి కొరగాని పేదవాన్ని
నా ఆస్తిపాస్తులు శూన్యం..
ఆకర్షించలేని నిరాకారున్ని
నాకు అందం బహుదూరం ...
సమాధానాలు చెప్పలేని అభాగ్యున్ని
నేను నిరక్షరాస్యతకు కొలమానం....
ముందడుగు వేయలేని అమాయకున్ని
నా గుండె అధైర్యం నిండిన కుండ....
పలచని నిస్సత్తువ మాటలే నా నోటిన
జాలువారుతుంటాయి ..ఏమో?
నా ఆత్మ న్యూనతాభావం నా శక్తిని
అడవి కాచిన వెన్నెల చేసేసిందేమో?
అయితే ఆ మహమ్మారి...
న్యూనతను అధిగమించడమే నా తక్షణ కర్తవ్యం..!

-యర్రాబత్తిన మునీంద్ర
నెల్లూరు

## విధి

విధి రాసిన రహస్య గీతం జీవితం
వెలుగులోనూ నీడలోనూ అదే సత్యం
కాలం చేతిలో తిరిగే మనిషి గమ్యం
కానీ కలలతో పోరాడే నవయువ హృదయం
మొబైల్ వెలుగులో మునిగిన లోకం
మనసు మాటలు మరచిన ఆధునిక యుగం
నవ్వులు ఎమోజీల్లో బందీ అయిన వేళ
నిజమైన అనుభూతి వెతుకుతోంది గుండె లోపల
పరుగులు పెడుతోంది విజయానికై యువత
కానీ దారి చూపే విలువలు ఎక్కడ
పోటీ మంటల్లో కాలుతున్న రోజులు
శాంతి కోసం వెతుకుతున్న రాత్రులు
స్వప్నాలు పెద్దవి.. సహనం చిన్నది
అవకాశాలు ఎన్నో.. దారి మాత్రం గందరగోళం
ఫాలోవర్స్ సంఖ్యలో కొలుస్తున్న గౌరవం
మనసు లోతుల్లో ఖాళీ నిశ్శబ్దం
విధి ఎదుట నిలబడి అడిగే ప్రశ్న
"నేనెవరు? నా గమ్యం ఎక్కడ?"
సమాధానం దొరుకుతుంది అంతరాత్మలో
సత్యం దాగి ఉంది ఆత్మ విశ్వాసంలో
పడిపోవడం తప్పు కాదు యువకుడా
లేచే ధైర్యమే నీ అసలైన గుర్తింపు
విధి రాసిందే మారదనుకోవద్దు
నీ నిర్ణయం కూడా రాస్తుంది కొత్త పథం
నేటి నవయువతే రేపటి దిశ
మార్పు నీ చేతిలోనే ఉంది నిజం
విధి ఒక గీత మాత్రమే స్నేహితా
దానికి స్వరమిచ్చేది నీ జీవన గాథ

-షేక్ రహీమ్ సాహెబ్

## అద్వితీయమైన బాధ్యత

ఎవరికి ఎవరు చేయాలి కర్తవ్య బోధ నిన్ను నీవు తెలుసుకుంటే
నీ కర్తవ్యమేమిటో గీతగా ప్రత్యక్షమవ్వదా..
అచేతనాన్ని పారద్రోలే కిషోర భానునికి ఎవరు చేశారు కర్తవ్య బోధ ప్రతినిత్యం పురుడు పోసుకోమని...
బీడు బారిన పుడమి తల్లి ఒడిని జల కలతో నింపమని ఆ మేఘుడికి ఎవరు చేస్తున్నారు నీతి బోధ. వర్ష ఋతువు వాహనమెక్కి కురవమని..
వాయు కాలుష్యంతో ప్రకృతిని నాశనం చేస్తున్న కూడా..
నిస్వార్థ గుణముతో ప్రాణులన్నింటికీ ఆయువునిస్తున్న తరువులకి ఎవరు చేశారు బోధ ప్రాణవాయువుని విడుదల చేయమని..
మధుకరం వంటి అల్పప్రాణులు కూడా
తమ ఉనికి కన్నా తమ కర్తవ్యానికి ప్రాధాన్యమిస్తుంటే.. ఉత్కృష్ట జన్మ పొందిన మానవుడు తన కర్తవ్యాన్ని మరిచి ...
నేల విడిచి సాము చేస్తానంటే..
దేవుడిచ్చిన ఈ జీవితానికి ప్రయోజనం ఏముంది?
కర్తవ్యం అంటే భారం కాదు
అదొక అద్వితీయమైన బాధ్యత.
ఏమి చేయాలనుకున్న ఈ దేహమందు ఆత్మ ఉన్నంతవరకే..
ధర్మ మార్గమందు నడిచి చూడు... సత్ఫలితాన్ని పొంది చూడు...
ఆరోగ్యవంతమైన సమాజమే నిర్మించబడుతుంది.

-శ్రీదేవి సురేష్ కుసుమంచి , విజయనగరం

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com